KANCHARLA
# మనసులోమాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## అమరావతి

| | | |
|---|---|---|
| ఎన్టీఆర్ | కృష్ణా | గుంటూరు |
| పల్నాడు | బాపట్ల | ప్రకాశం |

మంగళవారం 19 మే 2026 పేజీలు : 16




## సామాన్యుల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

- మాజీ మంత్రి విడదల రజిని

మిగతా 3

## ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం...




# దొంగల రాజ్యం దోపిడి రాజ్యం

- పెట్రోల్ డీజిల్ పెంపునకు నిరసనగా... కదం తొక్కిన వైసీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించండి
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

మిగతా 3



# బాపట్ల సూర్యలంక బీచ్ ఎందుకు గోవా బీచ్‌లా మారలేకపోతుంది?

- మరో గోవా లా తీర్చి దిద్దాలి అనుకునేవారు సాయంత్రం 6 గంటలకే ఎందుకు కాళీ చేయిస్తున్నారు?.
- సూర్యాలంక కు ఉన్న సహజ సిద్ధ అందాలు సరిపోవా?

3 లో






గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే

## కఠిన చర్యలు

- డీఎస్పీ హనుమంతరావు

- మిగతా వార్త 3లో



## రాజకీయాలలో ఆణిముత్యం

### సిపిఎం నేత డాక్టర్ మువ్వా కొండయ్య

కందుకూరు మే 18 (మనసులో మాట).. నేటి రాజకీయాలలో డాక్టర్ మువ్వా. కొండయ్య ఆణిముత్యం లాంటి వ్యక్తి అని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం బడేవారిపాలెం గ్రామంలో జరిగిన సిపిఎం కందుకూరు డివిజన్ సీనియర్ నాయకులు, హోమియో వైద్యులు డాక్టర్. మువ్వా. కొండయ్య సంస్మరణ సభ లో శ్రీనివాసరావు - మిగతా వార్త 3లో



## అగ్ని ప్రమాదంలో
# కాలిపోయిన కారు

**భట్టిప్రోలు మే 18 మనసులో మాట..** భట్టిప్రోలు మండలం 216 జాతీయ రహదారి మార్గంలోని భట్టిప్రోలు రైల్వే బ్రిడ్జి కి సమీపంలో కారులో సంభవించిన అగ్ని ప్రమాదానికి కారు పూర్తిగా కాలిపోయిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. భట్టిప్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయములో అడవులదీవి సర్పంచ్ శౌంఠి శ్రీనివాసరావు రేపల్లె నుండి తన ఏపీ 39ఎన్సీ 9718 నెంబరు గల రెనాల్ట్ ట్రైబర్ 2022 మోడల్ గల కారు లో విజయవాడ బయలుదేరారు.

మార్గమధ్యంలో యన్ హెచ్ 216 జాతీయ రహదారి మార్గంలోనున్న రైల్వే పై ఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి కారు లో నుండి చిన్న శబ్దం వచ్చింది.ఈ నేపథ్యంలో బ్రిడ్జి పై సుమారు 100 మీటర్లు భట్టిప్రోలు– చెరువుపల్లి వైపుకు వస్తున్న తరుణంలో పొగలు రావడంతో కారు లో ఉన్న సర్పంచ్,అతనితో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు కారు లో నుండి బయటకు వచ్చారు. ఒక్కసారిగా మంటలు ఎగసి కారు మొత్తం పూర్తిగా దగ్ధమైందని తెలిపారు.కారు లో ఉన్న ఏ ఒక్కరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. రేపల్లె నుండి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారని పోలీసు సిబ్బంది తెలిపారు.

## దేశంలో ఏ రాష్ట్రంలో లేని పెట్రో ధరలు, ఒక్క మన ఆంధ్రప్రదేశ్ లోనే అత్యధికం - బలసాని



**ప్రత్తిపాడు, మే 18 మనసులో మాట..** సోమవారం ఉదయం, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామంలో, మాజీ ముఖ్యమంత్రి వర్యులు, గౌరవ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు "వై.యస్ జగన్ మోహన్ రెడ్డి" ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ మరియు డీజిల్ ధరల పెంపు కారణంగా నిరసన తెలుపుతూ, పెంచిన ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని "ఏంఆర్ఓ" కి "వినతిపత్రం" అందించిన, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ " బలసాని కిరణ్ కుమార్" ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వం మరో 'బాదుడే బాదుడు' మొదలుపెట్టింది. సూపర్సిక్స్ తరహాలో మరో మోసంతో పచ్చి దగా చేస్తోంది. అధికారంలోకి వస్తే పెట్రో ధరలు తగ్గిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, అన్నింటిలాగే ఆ విషయాన్ని కూడా గాలికొదిలేసింది. ఒకవైపు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు లేవు. గత మా ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని పథకాలు రద్దు చేయడమే కాకుండా, ఇప్పుడు ఈ తరహా పెట్రో బాదుడే బాదుడుతో వాహనదారులతో పాటు, ప్రజల నడ్డి విరుస్తోంది అని అన్నారు. తాజా పెంపుతో రాష్ట్రంలో లీటరు పెట్రోల్ రూ.113.62, లీటర్ డీజిల్ రూ.101.24కు చేరింది. రాష్ట్రంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ఎక్కువగా ఉన్నాయి. పెరిగిన ధరల వల్ల పెట్రోల్పై రోజూ రూ.3.29 కోట్లు, డీజిల్పై రూ.6 కోట్లు అధిక భారం రాష్ట్రంలో వాహనదారులపై పడుతుంది. అలా రాష్ట్ర ప్రజలపై నెలవారీ పెట్రోల్పై రూ.98.7 కోట్లు, డీజిల్పై రూ.180 కోట్ల చొప్పున భారం పడనుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉచిత పథకాల వల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం?
## భారీగా నష్టపోతున్న రైతు విభాగం



**కారంపూడి, మే,18, ( పలనాడు జిల్లా )** మనసులో మాట :- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఉచిత పథకాలువల్ల రాజకీయంగా రాజకీయ పార్టీలకు వరంగా మారితే, ఇదే ఉచిత పథకాలు రైతుల పాలిటి శాపాలుగా మారాయని రైతులు వాపోతున్నారు. రాజకీయ నాయకులు తమ పదవుల కొరకు మరియు అధికారంలోకి వచ్చేందుకు ఉచిత పథకాలను ప్రవేశపెట్టి, తద్వారా అధికారంలోకి వచ్చి ఆ పథకాలను అమలుపరిచేందుకు లక్షలాది కోట్ల రూపాయలను అప్పులు చేసి ప్రజలకు పప్పు, బెల్లం లా పంచుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని మేధావుల విమర్శలు చేస్తున్న,ప్రభుత్వాలు మాత్రం తమ పని తాము చేసుకుంటూ పోతున్నాయని విమర్శలు వస్తున్న పట్టించుకొనకుండా కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఉచిత పథకాలు ఇచ్చేముందు అర్హులను ఎంపిక చేసి, ఉచిత పథకాలను ఇస్తే బాగుంటుందని మేధావుల మాటలను పెడచెవిన పెట్టి ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకు కొరకు అనరులకు కూడా ఉచిత పథకాలు ఇవ్వటం పై రైతులు విమర్శలు చేస్తున్నారు. గతంలో రెండు రూపాయలకు కిలో బియ్యం, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు 200, 4 00 రూపాయల చొప్పున ఉచిత పెన్షన్లు ఇచ్చినంత కాలం, లబ్ధిదారులు కూడా వాటిని ప్రభుత్వ కానుకగా తీసుకొని వ్యవసాయ కూలి పనులకు వచ్చేవారని, ఆ 200, 400 రూపాయలు కాస్త 4000, నుండి వివిధ రకాలైన లబ్ధిదారులకు 16 వేల రూపాయల వరకు చేర్చిన, ప్రభుత్వాలే మా వ్యవసాయ పనులకు కూలీలను దొరకకుండా చేస్తున్నారని రైతాంగం వాపోతోంది. కూలీలు దొరక్క రైతులం నానా ఇబ్బందులు పడుతున్నామని మా గోడు ఎవరికి చెప్పుకోవాలని, బాధను వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు రైతుకు పెట్టుబడులు పెరిగి వ్యవసాయం లాభసాటిగా లేకపోయినా, గత్యంతరం లేని పరిస్థితులలో ను, వ్యవసాయ వృత్తిని మానుకోలేక వ్యవసాయం చేస్తూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నామని బాధపడుతున్న రైతాంగాన్ని పట్టించుకునేది ఎవరు? వారిని ఆదుకునేది ఎవరు? పైరు పొలాల్లో కలుపులు తీసే సమయంలో కానీ, వరి నాట్లు వేసే సమయంలోను, పంటలు చేతికొచ్చే సమయంలో కానీ వ్యవసాయ కూలీలు దొరకక పరుగు రాష్ట్రమైన తెలంగాణ,ఒరిస్సా రాష్ట్రాల నుండి ఈ ప్రాంతానికి వలస కూలీలను అధిక కూలి రేట్లు ఇచ్చి తెచ్చుకోవాల్సిన పరిస్థితులను ఈ ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని రైతాంగం తమ వ్యధను వ్యక్తపరుస్తున్నారు. ఇలాంటి పరిస్థితులకు,ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాలకు లింక్ ఏమిటని ప్రశ్నించే మేధావులు ఉన్నారని, ఉచిత పథకాల ద్వారా అనర్హులైన వారికి అధిక మొత్తంలో పెన్షన్ల రూపంలో డబ్బును ఇస్తూ, వారిని ఎటువంటి పనులు చేయనీయకుండా సోమరిపోతులుగా మారుస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. 2014 ముందు ఎరువులు కట్టలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడం వలన ఎరువుల కట్టలు 900 రూపాయలను దాటి వెళ్ళలేదు. 2014 తర్వాత వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీని ఎత్తివేసి రైతు భరోసా అంటూ కొద్దిపాటి మొత్తాన్ని రైతుకు ఇవ్వచూపి, రైతును బిచ్చగాడిలా తయారు చేసిందని రైతాంగం ఘాటుగా విమర్శిస్తుంది. ఒక ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రద్దు చేయటం, వారికి నచ్చిన పథకాలను ప్రవేశపెట్టి ప్రజల నెత్తిన బలవంతంగా రుద్దటం ఈ ప్రభుత్వాలకే సరిపోతుందని విమర్శిస్తున్నారు. రైతు భరోసా అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 15, 20 వేల రూపాయలను తీసుకొని,అధిక రేట్లతో ఎరువులు కట్టలన కొనలేక సతమతమవుతున్న రైతన్నలను ఆదుకునే నాధుడే లేదని ఆవేదన చెందుతున్నారు. ఉదాహరణకు 2014 ముందు డీఏపీ మందు కట్ట 900 రూపాయలు ఉండగా ఇప్పుడు అదే డిఏపి కట్ట 2200 రూపాయల వరకు చేరుకుందని, అదే సబ్సిడీ ని కొనసాగిస్తే ఇంత భారం రైతుపై పడేది కాదని రైతులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల వల్లనే రైతులు నష్టాలను ఎదుర్కొని ఆత్మహత్యల వరకు వెళుతున్నారని బాధను వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు రేట్లు నిర్ణయిస్తూ, మేము గిట్టుబాటు ధరలను ప్రకటించి రైతులను ఆదుకుంటున్నామని చెబుతున్న ప్రభుత్వాలు, వారు నిర్ణయించిన రేట్లకు రైతు పండించిన పంటలను ఎవరైనా కొంటున్నారా అని చూస్తున్నారాఅని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు వరి పంటకు గిట్టుబాటు ధర అని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వాలు ఆ రేట్లకు ఎవరైనా కొంటున్నారా అని పరిశీలన చేసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. వరి పంటకు క్వింటాల్కు 1500 నుండి 1800 రూపాయల వరకు ప్రభుత్వం రేటు నిర్ణయిస్తే, బయట దళారులు కానీ, ఇతర రైస్ ఫ్యాక్టరీల వారు కానీ, 75 కేజీల కాటాబస్తాను కేవలం 900 నుండి 1200 రూపాయలు లోపు మాత్రమే కొనుగోలు చేసి రైతుల నడ్డి విరుస్తున్నారని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దేశంలో రైతు బ్రతికి ఉండాలంటే ప్రభుత్వాలు ఇస్తున్న రైతు భరోసా పథకాలను రద్దుచేసి, ఎరువులు కట్టలపై 2014 ముందు ఏ విధంగా సబ్సిడీ ఉన్నదో అదేవిధంగా సబ్సిడీలను కొనసాగిస్తూ ఎరువులు కట్టలను, ఆగ్రో కెమికల్ పురుగు మందు డబ్బాలను అందుబాటులోకి తీసుకువచ్చి,రైతుని ఆదుకోవాల్సిందిగా రైతు ప్రపంచం కోరుతుంది.

# వైకాపా తీరు 'గురువింద గింజ' సామెతలా ఉంది - ఎమ్మెల్యే జూలకంటి



**రెంటచింతల మే 18 మనసులో మాట..** గత ఐదేళ్ల వైకాపా దుర్మార్గపు పాలనలో ప్రజలను అన్నివిధాలా ఇక్కట్లకు గురిచేసి, ఇప్పుడు ధర్నాలు, నిరసనల పేరుతో డ్రామాలు ఆడుతున్న ఆ పార్టీ తీరు 'గురువింద గింజ' సామెతను తలపిస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని మంచికల్లు గ్రామంలో పర్యటించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం ఏదో ఒక వివాదం సృష్టించి పబ్లిసిటీ పొందడమే వైకాపా నేతలకు రివాజుగా మారిందని, వారికి కనీస లోకజ్ఞానం కూడా కరువైందని మండిపడ్డారు. నాసిరకం మద్యం, పెరిగిన ధరలతో ప్రజల నడ్డి విరిచారన్నారు.కరోనా కష్టకాలంలో ప్రజలు మృత్యుఘోషతో అల్లాడుతుంటే, నాణ్యత లేని చీప్ లిక్కర్‌ను మాచర్లలో రూ. 600లకు విక్రయించి పేదల మరణాలకు వైకాపా నేతలే కారణమయ్యారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. తమ పాలనలో ఎనిమిది సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి జనాన్ని బాదిన చరిత్ర వైకాపాదని గుర్తుచేశారు. అంతర్జాతీయంగా హార్మోజ్ జలసంధి వివాదం కారణంగానే ప్రధాని మోదీ పెట్రోలుపై 3.2 శాతం, డీజిల్ పై 3.4 శాతం మాత్రమే ధరలు పెంచాల్సి వచ్చిందని, కానీ వైకాపా మాత్రం ఇష్టానుసారంగా ధరలు పెంచి దోచుకుందని విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన రూ. 2 వేల కోట్ల జలజీవన్ మిషన్ నిధులను సైతం పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టలేక వైకాపా ప్రభుత్వం చేతగానితనాన్ని ప్రదర్శించిందని ఎద్దేవా చేశారు.

చంద్రబాబు విజన్‌కు దేశవ్యాప్త ప్రశంసలు..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమించే నిత్య శ్రామికుడని జూలకంటి కొనియాడారు. నాడు చంద్రబాబు హైదరాబాద్‌లో నిర్మించిన హైటెక్ సిటీని చూసి నేడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ వంటి వారే వేనోళ్ల పొగుడుతుంటే, ఇక్కడి వైకాపా నేతలు మాత్రం ఓర్వలేక విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 36 రోజుల్లోనే పుట్టపర్తికి లక్షల కోట్ల విలువైన రక్షణ, డ్రోన్, హెలికాప్టర్ల తయారీ ప్రాజెక్టును తీసుకురావడం చంద్రబాబు పట్టుదలకు, నిబద్ధతకు నిదర్శనమన్నారు. దేశంలోని వివిధ పార్టీల అగ్రనేతలంతా ఈ విజయాన్ని ప్రశంసిస్తుంటే, వైకాపా నాయకులకు మాత్రం అది మింగుడుపడటం లేదని ఎద్దేవా చేశారు.ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకులు యరపతినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, నాయకులు వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పున్నారెడ్డి, చేర్రెడ్డి కోటిరెడ్డి, బీసీ నాయకుడు బి. గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



### గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే

# కఠిన చర్యలు

**- డీఎస్పీ హనుమంతరావు**

**నాదెండ్ల మే 18 : మనసులోమాట,** నాదెండ్ల మండలం గణపవరం రాజీవ్ గాంధీ కాలనీలో పోలీసులు భారీ కార్డెన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించారు. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో సోమవారం సుమారు 100 మంది పోలీస్ సిబ్బందితో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కాలనీలో గంజాయి విక్రయించినా, తాగినా, అలాగే ఎలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో ఇదే కాలనీలో గంజాయి విక్రయిస్తున్న, 40 మందిని,అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన గుర్తుచేశారు.ఈ విస్తృత తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు, రికార్డులు లేని 24 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు. సీఐలు సుబ్బ నాయుడు, రమేష్, ఎస్ఐ అనిల్ కుమార్‌లతో పాటు నరసరావు పేట సబ్ డివిజన్‌కు చెందిన పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయాలలో ఆణిముత్యం

### సిపిఎం నేత డాక్టర్ ముప్వా కొండయ్య

- మొదటి పేజీ తరువాయి మాట్లాడుతూ డాక్టర్ ముప్వా.కొండయ్య నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు సిపిఎం పార్టీలో కొనసాగారని అన్నారు. రాజకీయాలలో డాక్టర్ ముప్వా కొండయ్య అని చెప్పారు. మరణించటం అందరికీ సహజమని,కానీ విలువలతో కూడిన మంచి వ్యక్తిగా జీవించి చనిపోవడం డాక్టర్ ముప్వా కొండయ్యకే దక్కిందన్నారు. సిపిఎం అభివృద్ధికి దోహదపడటం తోపాటు, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించిన వ్యక్తిగా డాక్టర్ కొండయ్య ఉన్నారని చెప్పారు. రాజకీయాలంటే ప్రజలలో అసహనం కలుగుతున్న ప్రస్తుత రోజుల్లో పదవులే, రాజకీయాలకు గీటురాయిగా ఉండకూడదని కొనసాగిన వ్యక్తిగా కొండయ్య ఉన్నారని పేర్కొన్నారు. అనేకమంది రాజకీయాలలోకి రాగానే పదవులు కావాలని కోరుకునే ఈరోజుల్లో, ముప్వా కొండయ్య జీవితం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందని చెప్పారు. పొగాకు రైతులు ప్రస్తుతం సంక్షోభం లో ఉన్నారని అన్నారు. గతంలో రైతులు ఆందోళనతో గిట్టుబాటు ధరలను సాధించుకునే వారిని అన్నారు. రైతులు గళం విప్పవలసిన అవసరం నేడు ఏర్పడిందన్నారు . పొగాకు సంక్షోభంలో ఉన్న సమయంలో టంగుటూరులో ఆందోళన చేసిన రైతులపై కాల్పులు జరిపారని, ఆ సందర్భంలో పలువురు చనిపోయిన విషయాన్ని శ్రీనివాసరావు గుర్తు చేశారు. ఆ ఆందోళన ఫలితంగా పొగాకు బోర్డు ఏర్పడిందని,దానిని నిర్వీర్యం చేయటానికి ఈ ప్రభుత్వాలు పూనుకున్నాయని చెప్పారు. పొగాకు సాగు జూదం లాగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ డాక్టర్ ముప్వా. కొండయ్య చదువును ప్రోత్సహించారని చెప్పారు. మాజీ మంత్రివర్యులు మానుగుంట మహిధర రెడ్డి మాట్లాడుతూ ముప్వా.కొండయ్య మితభాషి అన్నారు. పుట్టిన ఊరిని మరిచిపోకుండా ఇండ్లు కట్టుకోవడం జరిగిందన్నారు. ముప్వా కొండయ్య తన పేరును చిరస్థాయిగా, ప్రజలలో నిలిపారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు ముందుండేవారిని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ధన ప్రభావంలో కమ్యూనిస్టులు తట్టుకొని, ఉద్యమాలను ముందుకు తీసుకుపోవలసిన అవసరం నేటి సమాజానికి ఉందని పేర్కొన్నారు.

# సామాన్యుల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

**- మాజీ మంత్రి విడదల రజిని**

**చిలకలూరిపేటమే 18 మనసులో మాట..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా పేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శనలు, ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి విడదల రజిని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు ధర్నా చేపట్టాయి. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన విడదల రజిని, ఈ ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు .ధర్నాను ఉద్దేశించి మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఇది 'డబుల్ ఇంజిన్' సర్కారా? లేక సామాన్యులపై వేస్తున్న డబుల్ వాతా? ఎన్నికల ముందు సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికి,




ఇప్పుడు అధికారంలోకి వచ్చాక జనాల జేబులు కొల్లగొడుతున్నారు. నిత్యం ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తూ కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది." అని ఆమె మండిపడ్డారు.ప్రస్తుతం పెరిగిన ధరల వల్ల మార్కెట్‌లో 'ఏం కొనేతట్టు లేదు.ఏం తినేతట్టు లేదు' అంటూ పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని రజిని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఎన్డీఏకు కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల కోసం ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాటల మీద కూటమి ప్రభుత్వం ఎందుకు నిలబడలేకపోతోందని నిలదీశారు. కేంద్రంతో తక్షణమే సంప్రదింపులు జరిపి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, సామాన్యులపై పడుతున్న ఈ అదనపు భారాన్ని వెంటనే తొలగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున విడదల రజిని డిమాండ్ చేశారు.

# బాపట్ల సూర్యలంక బీచ్ ఎందుకు గోవా బీచ్‌లా మారలేకపోతుంది?

**బాపట్ల మే18 (మనసులో మాట)** ఆంధ్రప్రదేశ్‌లో అందమైన బీచ్‌లలో సూర్యలంక బీచ్ ఒకటి. సహజసిద్ధమైన అందాలు, ప్రశాంతమైన సముద్రతీరం, కుటుంబాలతో గడపడానికి అనుకూలమైన వాతావరణం ఇవన్నీ ఉన్నప్పటికీ, ఇది గోవా తరహా ప్రముఖ టూరిస్ట్ డెస్టినేషన్‌గా ఎదగలేకపోతోంది. దీనికి కొన్ని ప్రధాన కారణాలు ఉన్నాయి.

మొదటిగా, సాయంత్రం 6 గంటలకే పోలీసులు పర్యాటకులను బీచ్ నుంచి వెళ్లమని ఒత్తిడి చేయడం. సముద్రతీర ప్రాంతాల్లో రాత్రి సమయమే అసలు ఆకర్షణ. గోవాలో అయితే రాత్రి సమయంలో సంగీతం, ఫుడ్ స్టాల్స్, లైట్ డెకరేషన్స్, బీచ్ వాక్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి ఉంటుంది. కానీ సూర్యలంకలో సాయంత్రానికే బీచ్ ఖాళీ చేయించడం వల్ల టూరిస్టులకు నిరాశ కలుగుతుంది.

రెండవది, మద్యం ధరలు చాలా ఎక్కువగా ఉండటం. గోవాలో మద్యం తక్కువ ధరలకు అందుబాటులో ఉండడం వల్ల దేశం నలుమూలల నుంచి యువత ఎక్కువగా వెళ్తారు. కానీ సూర్యలంకలో అధిక ధరలు ఉండటం వల్ల పర్యాటకులు ఆసక్తి చూపడం తగ్గుతోంది.

మూడవది, నైట్ లైఫ్ పూర్తిగా లేకపోవడం. బీచ్ పక్కన క్యాఫేలు, లైవ్ మ్యూజిక్, చిన్న ఈవెంట్లు, ఫుడ్ కోర్టులు వంటి ఆకర్షణలు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో అక్కడ జీవం కనిపించదు.

నాలుగవది, సరైన పర్యాటక మౌలిక వసతుల లోపం. మంచి రిసార్ట్స్, బీచ్ షాక్స్, శుభ్రమైన వాష్‌రూమ్స్, పార్కింగ్ సదుపాయాలు, రాత్రి లైటింగ్ వంటి అంశాలు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది.

ఐదవది, ప్రచారం లోపించడం. గోవా అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ పొందింది. కానీ సూర్యలంక అందాలను ప్రభుత్వం, టూరిజం శాఖ పెద్దగా ప్రచారం చేయడం లేదు.

ఆరవది, యువతకు ఆకర్షణీయమైన కార్యకలాపాలు లేకపోవడం. వాటర్ స్పోర్ట్స్, బీచ్ ఫెస్టివల్స్, డీజే నైట్స్, అడ్వెంచర్ యాక్టివిటీస్ వంటి కార్యక్రమాలు ఉంటే మరింత మంది యువత ఆకర్షితులవుతారు.

సూర్యలంక బీచ్‌కు సహజ అందాలు ఎంతో ఉన్నాయి. సరైన ప్రణాళిక, స్వేచ్ఛాయుతమైన పర్యాటక వాతావరణం, మెరుగైన సదుపాయాలు, మరియు నైట్ టూరిజం అభివృద్ధి చేస్తే భవిష్యత్తులో ఇది కూడా గోవాకు పోటీగా నిలబడే అవకాశముందని పర్యాటక ప్రేమికులు చెబుతున్నారు.

## ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం...

# దొంగల రాజ్యం దోపిడి రాజ్యం

**పిడుగురాళ్ల, మే 18 (మనసులో మాట)..** ఇదే మీ రాజ్యం ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దోపిడీ పాలన సాగిస్తుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ పెరుగుదల నిరసిస్తూ వైఎస్ఆర్సిపి శ్రేణులు కదం తొక్కారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు డీజిల్ ధరలు పెంచమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల తర్వాత హామీని



తుంగలో తొక్కిందని కాసు మహేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని కొడుకు మనవడికి దోచిపెడుతున్నారని చంద్రబాబు పై ఆరోపణలు సంధించారు. వైఎస్సార్సీపీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు గురజాల నియోజకవర్గం వైసిపి ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు కొనసాగింది. అనంతరం పెంచిన పెట్రోల్, డీజిల్ తో పాటు నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని తాసిల్దార్ సూపర్నెంట్ కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలపై నిత్యవసర వస్తువులైన పెట్రోల్ డీజిల్ గ్యాస్ వంట నూనెల ధరలు ప్రజలకు గుదిబండలా మారాయన్నారు. ఎన్నికలకు ముందు పెట్రోల్ డీజిల్ నిత్యవసర వస్తువులు ధరలు పెంచే ప్రసక్తి లేదని కూటం ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలకు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించారన్నారు. ధరల పెంచి వారి జీవనంపై అధిక భారం వేస్తున్నారని రైతన్నలు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అవటమే కాకుండా వ్యవసాయానికి వాడే వాహనాలకు డీజిల్ ఎక్కువగా అవసరం అవుతుందని ధరలు పెంచడంతో రైతులకు పెనుబారంగా మారిందన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై కల్పిత కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలందరూ దీన్ని గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలకు త్వరలో తగిన బుద్ధి చెప్తారని పెంచిన పెట్రోల్ డీజిల్ నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పోరాడుతామని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజలకు మంచి చేయాలని వారికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పట్టణ మండల, గ్రామ వార్డు పార్టీ, అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్, డీజిల్ ధరలను
# వెంటనే తగ్గించాలి

### పెదకూరపాడు మండల కేంద్రంలో వైసీపీ శ్రేణుల నిరసన

**పెదకూరపాడు, మే 18, మనసులో మాట:** రాష్ట్రంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెదకూరపాడు మండల కేంద్రంలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారం మోపే విధంగా వ్యవహరిస్తోందని వైసీపీ నాయకులు ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఇప్పటికే పెరిగిపోయాయని, వాటికి తోడు దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన ధరలు అధికంగా ఉన్నాయని వారు విమర్శించారు.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేస్తూ పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలి



**రేపల్లె మే 18 మనసులోమాట..** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు చర్యలు చేపట్టిందని మండల వ్యవసాయ అధికారి విజయబాబు అన్నారు సోమవారం ఆయన మాట్లాడుతూ రేపల్లె మండలంలోని రైతు సోదరులందరికీ ముఖ్య సమాచారము రాయితీపైన వ్యవసాయ పరికరాలు అందిస్తున్నారు కావున రైతులు రాయతీ పరికరాలు కొరకుమే నెల 5వ తారీఖు నుండి మే 19వ తారీఖు వరకు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే మే 23 నుండి మే 25 లోపు లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది ఆ ఎంపిక చేసిన లబ్ధిదారులు మే 26 నుంచి జూన్ 9 లోపు చెల్లింపు పరికరాలకు సంబంధించిన నాన్ సబ్సిడీ చెల్లించవలెను.మే 26 నుండి జూన్ 26 లోపు పరికరాలను సరఫరా చేయడం జరుగుతుందిఅన్నారు జూన్ 30వ తారీకు తరువాత సబ్సిడీ నిధులు విడుదల చేయడం జరుగుతుంది. ఈ యొక్క రాయితీపై పరికరాలు పొందు రైతులు తప్పనిసరిగా ఎఈ పంట నందు నమోదు చేసుకొని ఉండాలని. సొంత భూమి మరియు కౌలు రైతులు కూడా అర్హులు. సబ్సిడీ పరికరాల కొరకు సమీపంలోని రైతు సేవ కేంద్రం నందు లేదా https://eseed.ap.gov.in/FM/farmerRegistration వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని రైతులు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మే నెల 19వ తారీకు అని తెలిపారు... ఎస్సీ/ ఎస్టి చిన్న సన్నకారు, మహిళ రైతులకు 50 శాతం , ఓసి మరియు పెద్ద రైతులకు 40 % ఆన్లైన్ లో పెట్టు టకు 19 మే తారీఖు చివరి తేదీ.. వ్యవసాయ శాఖ మరియు వారిని సంప్రదించాలని తెలియజేశారు.

# దేశ భవిష్యత్తుకు విద్యే పునాది



**నాదెండ్ల మే 18 : మనసులోమాట..** విద్య అనేది ఒక దేశ భవిష్యత్తుకు బలమైన పునాది. అయితే భారతీయ విద్యా వ్యవస్థ ఇప్పటికీ బ్రిటిష్ పాలనలో రూపొందించబడిన, భాష తత్వాలను ఆధారంగా చేర్చుకొని ముందుకు సాగుతుందని, చిరుమామిళ్ల విద్యా గ్రామాభివృద్ధి ప్రదాత గోల్కొండ గ్రూప్ సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ల రామిరెడ్డి అతిథి గృహంలో శనివారం రామిరెడ్డి మాట్లాడుతూ. విద్యార్థి మేధస్సు అభివృద్ధి, జీవిత నైపుణ్యాలకు బదులుగా మార్కులకు ప్రాధాన్యత నిచ్చే ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. అందువల్ల మన దేశంలో ఉన్న విద్య వ్యవస్థ గతంలో తయారైన భారత విధానాలను అనుసరిస్తూ నేటి కాలానికి సరిపోని విధంగా కొనసాగుతుందన్నారు. కేవలం పుస్తకాలపై ఆధారపడే మార్కుల పైన దృష్టి పెట్టే విధానం విద్యార్థులు నిజమైన ప్రతిభను బయట పెట్టడంలో విఫలం అవుతుంది అన్నారు. విద్యా అనేది వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం అన్నారు కానీ మనదేశంలో అమలవుతున్న ప్రస్తుత విద్యావ్యవ స్థ కొన్ని లోపాలతో పాటు ఆధునిక ప్రపంచ అవసరాలకు సరిపడని విధంగా ఉందన్నారు. మార్కులకే ప్రాధాన్యం కృత్రిమ పోటీ సృజనాత్మకతకు ప్రాధాన్యం లేకపోవడం, వంటి అంశాలు ఈవ్యవస్థలో కనిపిస్తున్న ప్రధాన సమస్యలు. పాఠశాలలో విద్యార్థులకు సమాచారాన్ని అర్థం చేసుకోవడం కన్నా, పాఠ్యాంశాన్ని జ్ఞాపకాల్లోకి తెచ్చుకుని పరీక్షలు వ్రాయడమే లక్ష్యంగా ఉంటుందన్నారు. ఇది వారిలో నిర్దిష్టమైన ఆలోచనలకు సమస్య పరిష్కార నైపుణ్యాలను తగ్గిస్తుందన్నారు. నేటి విద్యార్థులు ప్రగతి సాధించడంలో దిట్టలు కానీ విద్యార్థులు జీవితాన్ని ఎదుర్కోవడంలో అసాధ్యాలువంటి వాటిని పదవ తరగతి నుంచి పూర్తి చేయించాలి అన్నారు. వారి ఆర్థిక నిర్వహక, భావోద్వేగాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి మౌలిక జీవిత నైపుణ్యాలను, నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత విద్యార్థులు చదువుతున్న కోర్సులు ఉద్యోగ అవకాశాలు అనుకూలంగా ఉండటం లేదన్నారు. వాస్తవ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపకల్పన చేయాలన్నారు.విద్యా, టెక్నికల్ ట్రైనింగ్ అన్నారు. డిజిటల్ టెక్నాలజీ రోజు రోజుకి పెరుగుతుంది. అన్నారు. కానీ మన గ్రామీణ, పట్టణ పాఠశాలలో టె. క్నాలజీకి తగిన ప్రాధాన్యత లేదన్నారు. విద్యార్థుల కంప్యూటర్ అవగాహన కోడింగ్ పరిజ్ఞానం మొదలైనవి చిన్న వయసులోనే నేర్పాలి అన్నారు. విద్యార్థి ఎదుగుదలలోను, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇద్దరు సమాన పాత్ర పోషించాలన్నారు. వారి ఇద్దరి మధ్య సకాలంలో సమాచారం ఫీడ్ బ్యాక్ ద్వారా విద్యార్థులు సక్రమంగా మార్గ నిర్దేశం చేయవచ్చున్నారు. పరీక్షల భారం తల్లిదండ్రులు అంచనాలు పోటీవాతావరణ వల్ల పరిగణలోకి విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుందన్నారు. కావున ప్రతి పాఠశాలలో మానసిక సలహాదారులు ఉండాలి అన్నారు. విద్యార్థుఅభిప్రాయాలను తీసుకోవాలన్నారు. మన విద్యావస్థలో అవశ్యకమైన మార్పులు తెచ్చి, విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తకాలకు పరిమితం కాకుండా జీవితం నెరవేరే విద్య వైపు మన దృష్టిని మళ్లించవలసిన సమయం ఇదే అన్నారు. అంతేకాకుండా దేశ అభివృద్ధికి తోడ్పడే పౌరులును తయారు చేయడమే విద్య లక్ష్యం కావాలన్నారు. విద్యార్థి చదువులతోపాటు ఆలోచన చేసే శక్తి విషయాన్ని విశ్లేషించే సామర్థం కలిగి ఉండాలన్నారు.

# మత్స్యకారుల భూముల అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



**వేటపాలెం మే 18 ( మనసులో మాట)..** మత్స్యకారుల భూముల సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పుల్లరిపాలెం గ్రామంలోని రామచంద్రపురంలో మత్స్యకారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాన్పిక్ ప్రాజెక్టు ప్రతిపాదనలు వచ్చిన సమయంలో రామచంద్రపురం, కొత్తరెడ్డిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నిమ్మగడ్డ ఫౌండేషన్‌కు స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే అప్పటి నుంచి ఆ భూములపై ఎలాంటి అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం నిమ్మగడ్డ ఫౌండేషన్ వ్యవహారంపై సీబీఐ విచారణ కొనసాగుతోందని తెలిపారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూముల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, బాధిత మత్స్యకారులకు వారి భూములు యథాస్థితికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వచ్చే ఆదివారం మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మత్స్యకారులందరూ ఐక్యంగా పాల్గొని తమ హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలని కోరారు.

# సంకురాత్రిపాడు గ్రామ క్రికెట్ మహోత్సవం

**- ప్రధమ బహుమతిని గెలుసుకున్న, సంకురాత్రిపాడు టీమ్**

**- టోర్నమెంటు ముగింపు కార్యక్రమానికి ముఖ్యాధికారిగా డిప్యూటీ ఎం పి డి ఓ, వెంకట్రావు**



**నాదెండ్ల, మే 18 : మనసులోమాట,** సంకురాత్రిపాడు గ్రామంలో 40 రోజుల క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగింపు సంకురాత్రిపాడు గ్రామ క్రికెట్ మహోత్సవం 2026 సంకురాత్రిపాడు గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన 40 రోజుల భారీ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. మొత్తం 40 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ గ్రామంలో క్రీడా ఉత్సాహాన్ని నింపింది. పరిసర గ్రామాల నుంచి వచ్చిన యువ క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా సంకురాత్రిపాడు స్పెషల్ ఆఫీసర్ మరియు డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు , డిప్యూటీ ఎంపీడీవో జోజి , మురుకుట్ల సాంబశివరావు , తోట రాము , కొక్కెర భిక్షాలు , కొక్కెర చిట్టిబాబు , ప్రతీ సాంబశివరావు , బత్తుల సీతారామయ్య హాజరై విజేత జట్లకు ట్రోఫీలు మరియు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతిని సంకురాత్రిపాడు టీమ్ కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని సంకురాత్రిపాడు సాయి 11'o జట్టు సాధించింది. తృతీయ బహుమతిని జగ్గాపురం జాన్సన్ టీమ్ దక్కించుకుంది. విజేత జట్లకు నగదు బహుమతులు మరియు ట్రోఫీలు అందజేశారు. ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే ఉత్తమ బ్యాట్స్‌మన్, ఉత్తమ బౌలర్, ఉత్తమ ఫీల్డర్‌లకు ప్రత్యేక బహుమతులు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఈ టోర్నమెంట్ ఎంతో ఉపయోగపడిందని గ్రామ పెద్దలు మరియు నిర్వాహకులు తెలిపారు. 40 రోజుల పాటు కొనసాగిన ఈ క్రికెట్ మహోత్సవం సంకురాత్రిపాడు గ్రామంలో పండుగ వాతావరణాన్ని సృష్టించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.



## మనసులో మాట దినపత్రిక బహుకరణ

నందిగామ మే 18 మనసులో మాట.. పట్టణం లో నందిగామ డివిజనల్ పశు సంవర్ధక శాఖ డిడి . డాక్టర్." మోసెస్ వెస్లీ " వారికి మనసులో మాట దినపత్రిక ను బహుకరించిన జర్నలిస్ట్ " షాబాన్ పాష". ఈ సందర్భంగా వేగవంతంగా అన్ని వార్తలు కవర్ చేస్తున్న మనసులో మాట దినపత్రిక యాజమాన్యం వారికి, జర్నలిస్ట్ షాబాన్ పాష కి డాక్టర్. మోసెస్ వెస్లీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నందిగామ మున్సిపాలిటీ 20 వార్డులను 32 వార్డులుగా పునర్విభజన



నందిగామ మే 18 మనసులో మాట.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఉత్తర్వులన నుసరించి, కమీషనర్ & సంచాలకులు, పురపాలక శాఖ వారి ఆదేశానుసారం ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 32 వార్డులుగా పునర్విభజన చేపట్టి రూపొందించిన ముసాయిదా ప్రతులను పలు ప్రభుత్వ కార్యాలయములందు అనగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, తహశీల్దార్ వారి కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, తపాలా కార్యాలయం, ఉప ఖజానాధికారి కార్యాలయం మరియు పురపాలక సంఘ కార్యాలయం నందలి నోటీస్ బోర్డుల యందు ప్రదర్శించడమైనది మరియు సంబంధిత వార్డు పునర్విభజన ముసాయిదాపై ఏ విధమైన సూచనలు/ సూచనల ఉన్న యెడల ది 24-05-2026 సాయంత్రం 5.00 గంటల లోపు నందిగామ పురపాలక సంఘ కార్యాలయం నందు లిఖితపూర్వకంగా సమర్పించవలసిందిగా కమీషనర్ జి. లోవరాజు ఒక ప్రకటనలో కోరారు.

### దాంపత్య జీవితంలో మనస్పర్థలు..

## అత్తపై అల్లుడి దాడి.. వృద్ధురాలు మృతి



కోసూర్, మే 18, మనసులో మాట: దాంపత్య జీవితంలో ఏర్పడిన మనస్పర్థలు ఓ కుటుంబంలో విషాదానికి దారితీశాయి. కోసూర్ మండలం నాగవరం గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. భార్యను వేధిస్తున్నాడని అల్లుడితో మాట్లాడేందుకు వెళ్లిన అత్త అల్లాబి, ఆమె తల్లి ఫాతిమా(70)పై అల్లుడు ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు బాధితురాలు తెలిపింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందగా, అల్లాబి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు గ్రామస్తుల వినతులు

### - తాగునీరు, రోడ్లు, కాలువలు, పింఛన్ల సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహణ



**అచ్చంపేట, మే 18, మనసులో మాట:** పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టిన "వంద రోజులు 100 గ్రామాలు" కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోనూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, ప్రజలతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించి స్థానిక సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. గ్రామంలో తాగునీటి సమస్య, సీసీ రోడ్ల నిర్మాణం, కాలువల అభివృద్ధి, విద్యుత్ సమస్యలు, పింఛన్ల మంజూరు తదితర అంశాలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోలు డీజిల్ ధరలు తగ్గించాలి

### వైసిపి నిరసన ధర్నాలో నాయకుల డిమాండ్



**చీరాల మే 18( మనసులో మాట)..** రాష్ట్రంలో పెంచిన పెట్రోలు డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు వైసిపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులు గత సార్వత్రిక ఎన్నికలలో పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. కూటమి పెద్దలు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం సరికాదని హితవు పలికారు. అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలను తాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం నందు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈనాటి నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవ పున్నారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అద్దంకి రెడ్డి, రైతు విభాగం నాయకులు రమణారెడ్డి, గవిని శ్రీనివాసరావు, బొనిగల జైసం బాబు, నియోజకవర్గం లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిడిపి పట్టణ సహాయ కార్యదర్శి షేక్ ఖాదర్ జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం మే 18 మనసులో మాట** కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన జంపాల సీతారామయ్య , చెన్నుబోయిన చిట్టిబాబు సత్కరించిన మైనార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కొండపల్లి పట్టణ సహాయ కార్యదర్శి షేక్ ఖాదర్ జన్మదిన వేడుకలు స్థానిక మైనార్టీ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు హాజరయ్యారు. కేక్ కట్ చేసిన అనంతరం ఖాదర్ కు కేక్ తినిపించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం అమరావతి (మనసులో మాట) దినపత్రిక ను ఆవిష్కరణ చేశారు, అనంతరం మైనార్టీ సోదరులు ఖాదర్ ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తెనాలి మునిసిపాలిటీ వార్డుల పునర్విభజన



**తెనాలి మే18(మనసులో మాట)** మునిసిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం ఉన్న 40 వార్డులను52 వార్డులుగా పెంచినట్లు గుంటూరు పురపాలక పరిపాలన శాఖ సంచాలకుల సర్క్యులర్ మేరకు తెనాలి మునిసిపాలిటీ పరిధిలో 52 వార్డులుగా పునర్విభజన చేపట్టి, సంబంధిత వార్డుల వివరాల ముసాయిదా ఉత్తర్వులను సోమవారం మునిసిపాలిటీ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు విడుదల చేశారు. ఈ ముసాయిదా ఉత్తర్వులను ప్రజల అవగాహనకు మునిసిపాలిటీ కార్యాలయ నోటీసు బోర్డులో అలాగే పట్టణ పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శనకు ఉంచారు. వార్డుల పునర్విభజనపై పట్టణ ప్రజల నుండి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుంది, ఆసక్తి గల ప్రజలు తమ అభిప్రాయాలను ఈ నెల 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు కార్యాలయ పని వేళల్లో లిఖితపూర్వకంగా మునిసిపాలిటీ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ జె.రామ అప్పల నాయుడు కోరారు.అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి, మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్ ,అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు,జోసఫ్ ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



## శిథిలావస్థకు చేరినమిట్టపాలెం ఎలిమెంటరీ స్కూల్

**చిలకలూరిపేట రూరల్ మే 18 మనసులో మాట..** మిట్టపాలెం ఎస్ సి కాలనీ నందు గల ఎలిమెంటరీ స్కూలు గత కొన్ని సంవత్సరాలుగా వాడుకలో లేదు దీనికి కారణం బిల్డింగు పాత పడిపోవటం పెచ్చు లూడిపోవడం పిల్లలకి ఇబ్బంది కలిగి ప్రమాదం జరుగుతుందని తరగతి గదులు పక్కనే ఉన్న చర్చిలో నిర్వహిస్తున్నారు అధికారులు నాయకులకు ఇప్పటికైనా స్పందించి స్కూలు నిర్మాణం చేయాలని గ్రామస్తులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా స్పందించి స్కూల్ నిర్మాణం చేపట్టాలని కోరుచున్నారు.

## 22 ఏళ్లుగా పట్టించుకోని డ్రైనేజీ వ్యవస్థ..

- వర్షాకాలం వస్తే మా ప్రాణాలు గాల్లోనే..
- కలెక్టర్‌కు లింగంగుంట్ల గ్రామస్తుల ఆవేదన!



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం, లింగంగుంట్ల గ్రామంలోని కాలనీ నివాసితులు దశాబ్దాలుగా తీవ్ర డ్రైనేజీ సమస్యలతో నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలోని రామచంద్ర కాలనీ, కలెక్టర్ ఆఫీస్ లైన్ పరిధిలో గత 22 సంవత్సరాలుగా కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టర్ కి గ్రామస్తులు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమవడంతో మురుగునీరు సజావుగా సాగక, ఇళ్లల్లోకి వస్తోంది. దీనివల్ల కాలనీ అంతా దుర్వాసన వెదజల్లుతూ నివాస యోగ్యం కాకుండా తయారైంది. ఈ తీవ్ర సమస్యపై గతంలో స్థానిక సచివాలయ అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు మొరపెట్టుకున్నప్పటికీ, ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్నది వర్షాకాలం కావడంతో ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని కాలనీవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండి దోమలు, ఈగలు వ్యాపించి, చిన్నపిల్లలు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని తక్షణమే తమ లైన్‌లోని డ్రైనేజీ కాలువలను బాగు చేయించి పూడికతీత పనులు చేపట్టేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని లింగంగుంట్ల కాలనీ నివాసితులు అత్యంత వినయంగా ప్రార్థిస్తున్నారు.

# ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మానవత్వం..

**- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**



**అమరావతి, మే 18, మనసులో మాట:** పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. అమరావతి మండలం లేమల్లె గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో స్థానిక టీడీపీ నాయకుడు ఏసుపాదం సహా ముగ్గురు గాయపడగా, అక్కడి పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించారు.

అచ్చంపేట మండలంలోని కోనూరు గ్రామంలో నిర్వహించిన "వంద రోజులు 100 గ్రామాలు" కార్యక్రమాన్ని ముగించుకుని గుంటూరు వెళ్తున్న సమయంలో ప్రమాదాన్ని చూసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు ఆదేశించారు. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే చూపిన చొరవ, మానవత్వంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

# 43వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

- క్యాండిల్ లైట్ ర్యాలీని ప్రారంభించిన శాసనసభ్యులు డా. చదలవాడ అరవింద బాబు
- సక్రమంగా ఏఆర్టి మందులు వాడితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చు- ఎమ్మెల్యే పిలుపు
- 'మిషన్ ఎయిడ్స్ సురక్ష'పై అవగాహన కల్పించిన జిల్లా అధికారి డా.యు.మాధవి లత




**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట పట్టణంలో 43వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఏర్పాటు చేసిన భారీ క్యాండిల్ లైట్ ర్యాలీని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారం నాడు ఈ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది "హెచ్ఐవి తో చనిపోయిన వారిని మేము గుర్తుంచుకుంటాం, మేము అవగాహనతో ముందుకెళ్తాం, మేము చర్య తీసుకుంటాం" అనే నినాదంతో సమాజంలో చైతన్యం తెచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఎయిడ్స్ బారిన పడి మరణించిన వారి మృతికి సంతాపం ప్రకటిస్తూ, ప్రస్తుతం హెచ్ఐవితో జీవిస్తున్న బాధితులకు "మేమున్నాం" అనే నైతిక ధైర్యాన్ని కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. హెచ్ఐవి బాధితులు ఎలాంటి అధైర్యానికి లోనుకాకుండా, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఏ ఆర్ టి మందులను క్రమం తప్పకుండా వాడితే సుదీర్ఘ కాలం ఆరోగ్యంగా జీవించవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. అనంతరం జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టిబి నియంత్రణ అధికారి డాక్టర్ యు. మాధవి లత మాట్లాడుతూ హెచ్ఐవి నివారణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం" గురించి, దాని ద్వారా లభిస్తున్న వైద్య సేవలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరి, జిల్లా 'దిశ' సిబ్బంది, ఐసిటిసి, ఏఆర్టి వైద్య సిబ్బంది, డిఎస్ఆర్సి సిబ్బంది, జిల్లాలోని టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిఎస్ సి, లింక్ వర్కర్ స్కీమ్ మరియు వి హెచ్ ఎస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

# పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలపై వైయస్సార్సీపీ నిరసన

**రిక్షా తొక్కుతూ నిరసన తెలియజేసిన వరికూటి అశోక్ బాబు - పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి**



కొల్లూరు : మే 18:(మనసులో మాట ) వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండల కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సోమవారం కొల్లూరు బస్టాండ్ సెంటర్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వేమూరు నియోజకవర్గ వైయస్సార్సీపీ ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. కొల్లూరు బస్టాండ్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు స్వయంగా రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోయాయని ఆరోపించిన ఆయన, ప్రభుత్వం వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఇంధన ధరల పెంపుతో వ్యవసాయ ఖర్చులు మరింత పెరిగి రైతులపై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేష్ వంటి నాయకులు విమానాల్లో ప్రయాణాలు చేయగలరేమో గానీ సామాన్య ప్రజలు మాత్రం బైక్, ఆటో నడపలేని పరిస్థితి నెలకొందని అశోక్ బాబు విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం అన్ని వస్తువుల ధరలపై పడుతోందని, దీనివల్ల ప్రజల జీవనం మరింత కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలు తగ్గించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుగ్గన మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారం మోపే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదల వలన నిత్యవసర సరుకులతో పాటు సామాన్య ప్రయాణికులపై అధిక భారం పడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు రెండు సంవత్సరాలు అవుతున్న ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేక పోయిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గం లోని పార్టీ నాయకులు సుగ్గన మల్లేశ్వరరావు, పెరికల పద్మారావు, ఎస్ దేవదాస్ నాయక్ , దాది సుబ్బారావు, విష్ణు ములకల రెడ్డయ్య, గాదె శివరామ కృష్ణారెడ్డి, డి. మేరేస్ బాబు, కూచిపూడి మోషే, నవరత్నం, సనక వెంకట్రామయ్య, బిట్రగుంట సత్యనారాయణ, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అన్నా క్యాంటీన్లను పరిశీలించిన టీడీపీ నాయకులు

**చిలకలూరిపేటమే 18 మనసులో మాట..** మాజీ మంత్రి శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పట్టణంలోని అన్నా క్యాంటీన్లను మున్సిపల్ మాజీ చైర్మన్ రఫాని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ వహాబ్, చిన్నబాబు తదితరులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చిలకలూరిపేట పట్టణంలో ప్రస్తుతం మూడు అన్నా క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. నిరుపేదలు, కూలీలు, రిక్షా కార్మికులు, మరియు బాటసారుల ఆకలి తీర్చాలనే ఉన్నత ఆశయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ క్యాంటీన్లను ప్రారంభించారని, పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు.

**భోజన నాణ్యతపై సంతృప్తి..**

శాసనసభ్యుల ఆదేశాల మేరకు మూడు క్యాంటీన్లను క్షుణ్ణంగా పరిశీలించిన నాయకులు, అక్కడ అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు ముగ్గురు స్వయంగా క్యాంటీన్‌లో భోజనం చేసి, ఆహార నాణ్యతను పరిశీలించి అభినందించారు.

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం:**

"ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మేము పట్టణంలోని అన్నా క్యాంటీన్లను తనిఖీ చేశాం. ఇక్కడి ఏర్పాట్లు, భోజన సదుపాయాలు చాలా బాగున్నాయి. క్యాంటీన్ల తాజా పరిస్థితిని, నిర్వహణ వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు క్యాంటీన్ సిబ్బంది పాల్గొన్నారు.

# దోర్నాల ప్రజలకు శుభవార్త తెలిపిన ఎరిక్షన్ బాబు



**పెద్ద దోర్నాల 18(మనసులో మాట)..** పెద్ద దోర్నాల మండలం, దోర్నాలలోఈ నెల 21న దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌కు శంకుస్థాపన జరగనుంది. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సోమవారం వెల్లడించారు,అందుకు సంబందించిన ఏర్పాట్లను ఎరిక్షన్,బాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఉగ్ర. నరసింహారెడ్డిలు అధికారులు, నాయకులతో కలిసి సాగర్ నీటిపనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దోర్నాలమండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ మాబు, వై మల్లికార్జున్ రెడ్డి, జనసేన పార్టీ మండలఅధ్యక్షులు కేతి వెంకట మురళి,బట్టు సుధాకర్ రెడ్డి,వి కాశయ్య ( లాయర్).దోర్నాల మండలడీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు దేసు. నాగేంద్రబాబు,దొడ్డ శేషాద్రి, చంటి,జెడి లక్ష్మయ్య,మాజీ జెడ్పిటిసి జంగిలి. పిచ్చయ్య, ఈదర మల్లయ్య, ఎలకపాటి చెంచయ్య, మౌలాలి, దానం, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన పొదుపుపై నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ వినూత్న ప్రచారం!

- పశ్చిమాస్య యుద్ధ సంక్షోభం నేపథ్యంలో స్వయంగా రిక్షా తొక్కి ప్రజల్లో చైతన్యం తెచ్చిన ఎమ్మెల్యే
- ఆదివారం సైకిల్.. సోమవారం రిక్షాపై ప్రజా పర్యటన,సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు
- దేశంలో రోజుకు 250 మిలియన్ లీటర్ల పెట్రోల్ వినియోగం,ఇంధన పొదుపే అసలైన దేశభక్తి



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** పశ్చిమాస్య (వెస్ట్ ఆసియా) యుద్ధ సంక్షోభం వల్ల స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ మూసుకుపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా తీవ్ర సంక్షోభంలో పడింది. భారతదేశం తన క్రూడ్ ఆయిల్ అవసరాలలో సుమారు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన పొదుపు చర్యలను అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రోత్సహిస్తున్నాయి. ఈ తరుణంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు అత్యంత వినూత్న మార్గంలో ప్రజలను చైతన్యపరుస్తూ ఆదర్శంగా నిలిచారు. "పెట్రోల్ వాహనాల్లో ప్రయాణాలు వద్దు రిక్షా బండిలే ముద్దు" అనే నినాదంతో ఆయన స్వయంగా రిక్షా తొక్కుతూ నియోజకవర్గంలో 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం నాడు సైకిల్ తొక్కుతూ పర్యటించిన ఎమ్మెల్యే, సోమవారం ఉదయం రిక్షా తొక్కుతూ నేరుగా ప్రజల మధ్యకు చేరుకున్నారు. ఎమ్మెల్యే స్వయంగా సామాన్యుడిలా రిక్షా తొక్కుతూ కనిపించిన ఈ దృశ్యం స్థానికులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశం రోజుకు సుమారు 250 మిలియన్ లీటర్ల పెట్రోల్, 350 మిలియన్ లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తోందని తెలిపారు. "మన దేశ ఆర్థిక వ్యవస్థపై ఇంధన దిగుమతుల భారం భారీగా ఉంది. పశ్చిమాస్య సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లు గరిష్ట స్థాయికి చేరాయి. ఇది మన విదేశీ మారక నిల్వలపై, ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది" అని ఆయన వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇంధన పొదుపును 'దేశభక్తి'గా అభివర్ణించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, కార్ పూలింగ్, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి చర్యలను ప్రోత్సహిస్తోందని, దానికి మద్దతుగా రాష్ట్రంలో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. సైకిల్, రిక్షా బండి వంటి సాంప్రదాయ పర్యావరణ స్నేహపూర్వక వాహనాలను ఉపయోగించడం ద్వారా అటు కాలుష్యాన్ని తగ్గించవచ్చని, ఇటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఇంధన ఖర్చు కూడా భారీగా ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఒక్క రిక్షా ప్రయాణం ద్వారా ప్రతి కిలోమీటర్‌కు పెట్రోల్ వినియోగాన్ని తగ్గించవచ్చని, ఇలాంటి చిన్న చిన్న అడుగులే దేశాన్ని ఇంధన స్వావలంబన వైపు నడిపిస్తాయని ఎమ్మెల్యే చదలవాడ ఆశాభావం వ్యక్తం చేశారు. నరసరావుపేట నియోజకవర్గంలో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం రాష్ట్రంలోని మరియు దేశంలోని ఇతర ప్రజా ప్రతినిధులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని స్థానిక మేధావులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరుతూ "మనం మారాలి.. అప్పుడే దేశం మారుతుంది" అని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు ఇచ్చిన పిలుపు అందరినీ ఆలోచింపజేస్తోంది.

# నరసరావుపేటలో మందుబాబుల వీరంగం,చిరు వ్యాపారుల కుండలు ధ్వంసం!



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** నరసరావుపేట పట్టణంలో మందుబాబులు బరితెగించారు. రాత్రి వేళల్లో మద్యం మత్తులో తూలుతూ సామాన్య చిరు వ్యాపారుల పొట్టకొడుతున్నారు. పల్నాడు రోడ్డులోని పాత ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు గుర్తుతెలియని దుండగులు వీరంగం సృష్టించారు.రోడ్డు పక్కన స్థానిక నిరుపేద వ్యాపారులు అమ్మకానికి ఉంచిన మట్టి కుండలను దుండగులు పగలగొట్టి తీవ్ర నష్టం చేకూర్చారు. అంతటితో ఆగకుండా, పక్కనే ఉన్న కొన్ని దుకాణాల తాళాలను కూడా పగులగొట్టేందుకు ప్రయత్నించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఎండ తీవ్రత దృష్ట్యా పొట్టకూటి కోసం అప్పులు తెచ్చి వేసవి వ్యాపారంగా కుండలను తెచ్చుకున్నామని, రాత్రికి రాత్రే వాటిని ధ్వంసం చేయడంతో తాము రోడ్డున పడ్డామని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కష్టపడి సంపాదించుకునే తమపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలో రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, పాత ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో మద్యం తాగి గొడవలు సృష్టిస్తున్న వారిపై నిఘా పెట్టాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

# గ్రామాలకు తరలండి - క్యాంపెయిన్ కు సిద్ధం కండి - ఎమ్మార్పీఎస్ పిలుపు

**- నరసరావుపేట టౌన్ హాల్‌లో ఘనంగా జరిగిన పల్నాడు జిల్లా అనుబంధ సంఘాల సమావేశం**



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణ కేంద్రంలోని టౌన్ హాల్ లో ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల పల్నాడు జిల్లా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అద్దంకి బాబు మాదిగ సభా అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఇన్చార్జి దుడ్డు రామకృష్ణ మాదిగ హాజరై ఉద్యమ కార్యాచరణపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు దాసరి నాగయ్య మాదిగ, ఎంఈఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు హిట్లర్ మాస్టర్ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన జాతి ప్రజలకు విద్యా ప్రాముఖ్యతను వివరించి జాతి బిడ్డలను చదివించాలని పిలుపునిచ్చారు. విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణ ఫలాలు అందుకునే విధంగా వారిలో నైపుణ్యం పెంచాలని,రాబోయే 40 రోజుల పాటు విద్యా ప్రాముఖ్యత మాసాలుగా భావించి ఎమ్మార్పీఎస్ శ్రేణులు గ్రామాలకు తరలివెళ్లి క్యాంపెయిన్ కు సిద్ధం కావాలని కోరారు. అలాగే గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణాలు చేపట్టి జులై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ పల్నాడు జిల్లా అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరరావు మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మాతంగి సత్యానందం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొడవటి అశోక్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు పేరుపోగు రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ నరసరావుపేట నియోజకవర్గం ఇంచార్జి చిరుగూరి నాగరాజు మాదిగతో పాటు పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకులు, మహిళా నాయకత్వం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజల భాగ్యస్వామ్యంతో డెంగ్యూను అరికట్టుదాం. డా.దాక్షాయిని

**మాచర్ల.18 మే (మనసులో మాట)..** ప్రజల భాగ్య స్వామ్యంతో డెంగ్యూని అరికట్టుదామని డాక్టర్ దాక్షాయిని అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మాచర్ల పట్టణంలోని గౌడ కాలనీలో గల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిలవ ఉండకుండా చూసుకోవడం ద్వారా డెంగ్యూను హఅరికట్టవచ్చున్నారు. వారానికి ఒక్కరోజు డ్రై డే పాటించాలని సూచించారు. డాక్టర్లు. నర్సులు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వైసిపీ కార్యకర్త రంగారెడ్డి అరెస్ట్



**మాచర్ల.18 (మే మనసులో మాట)** మాచర్ల నియోజవర్గం లోని. కంభం పాడు గ్రామానికి చెందిన వై సీ పి కార్యకర్త నెమలిదిన్నె రంగారెడ్డిని ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో టిడిపి నేతలపై అనుచిత పోస్టులు పై అరెస్టు చేశారు. కోర్ట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చెయడంతో నిందితుడని న్యాయమూర్తి ఎదుట హాజరపరిచారు. ఒక కేసులో పూచి కత్తిపై విడుదలైన వెంటనే. రూరల్ సీఐ ఎస్సై పోలీసులు ఆయనను మరో కేసులో తిరిగి అదుపులోకి తీసుకున్నారు.

## చెరువు సమీపంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి



**చీరాల మే 18 ( మనసులో మాట)..** మంచి నీటి చెరువు సమీపంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ని కలసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ పట్టణంలో సేకరించిన చెత్తను తాగునీటి చెరువు సమీపంలో పారవేస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రామాపురం ప్రాంతంలో చెత్త డంపింగ్‌కు ప్రత్యేక స్థలం ఉన్నప్పటికీ మంచినీటి చెరువు వద్ద చెత్తను వేయడం ఏమిటని ప్రశ్నించారు. చెత్తను వేయడం వల్ల తాగునీరు కలుషితమై పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు.
ప్రస్తుతం మంచినీటి చెరువు సమీపంలో మరో పది ట్రక్కుల చెత్తను పారవేస్తున్నారని తెలిపారు. ఈ చెత్తాచెదారం వల్ల బ్యాక్టీరియా వలన వ్యర్థాలు ఏర్పడి మంచినీరు కాలుష్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు అందించడం మున్సిపాలిటీ బాధ్యత అని అన్నారు. ఈ నాటి ధర్నా కార్యక్రమంలో దళిత బహుజన పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలి

**- సామాన్యుడి కోసం గళమెత్తిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి!**

**- నరసరావుపేటలో వైస్సార్సీపీ భారీ నిరసన ర్యాలీ,కలెక్టరేట్ వద్ద వినతిపత్రం అందజేత**

**- ఎన్నికల ముందు లోకేష్ బాబు ఇచ్చిన హామీ ఏమైంది? కూటమి ప్రభుత్వంపై గోపిరెడ్డి నిప్పులు**

**- సూపర్ సిక్స్ లేదు,ధరల నియంత్రణ లేదు,కూటమి పాలనలో సామాన్యుడిపై పెను భారం!**



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనాలోచితంగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేటలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి, లింగంగుంట శివారులోని కలెక్టరేట్ కార్యాలయం పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి పెంచిన ఇంధన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలనే అవలంబిస్తోంది. డీజిల్,పెట్రోల్ ధరల పెంపు కారణంగా రవాణా వ్యయం పెరిగి,రేపటి నుండి కూరగాయల దగ్గర నుండి వంటనూనెల వరకు అన్ని నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది.ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని పెను భారం అని గత ఎన్నికల ముందు నారా లోకేష్ పాదయాత్ర చేస్తూ పొరుగు రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో వ్యాట్ టాక్స్ ఎక్కువగా ఉందంటూ,తాము అధికారంలోకి వస్తే పెట్రోల్,డీజిల్ ధరలను సగానికి సగం తగ్గిస్తామని ప్రగల్భాలు పలికారని గోపిరెడ్డి గుర్తుచేశారు.ఈరోజు వైస్సార్సీపీ తరపున మేము సూటిగా అడుగుతున్నాం లోకేష్ బాబు మీరు ఇచ్చిన మాట మీద నిలబడతారా లేదా? సగం ధరలు తగ్గించడం దేవుడెరుగు.. ఉన్న ధరలను మరింత పెంచి ప్రజల నడుం విరుస్తున్నారు అని ధ్వజమెత్తారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో కేంద్రం ధరలు పెంచితే గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు రాష్ట్రంలో అదనంగా 4 శాతం వ్యాట్ టాక్స్ పెంచి ప్రజలను దోచుకుం టున్నారని విమర్శించారు. నిరుద్యోగుల కు 30 లక్షల ఉద్యోగాలు మహిళలకు రూ.15,000 ఇస్తామన్న హామీలు ఎటుపోయాయని ప్రశ్నించారు. రైతుల కు పెట్టుబడి సాయం లేదు, విద్యార్థు లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదు.కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వకపోగా ఉన్నవాటిలోనే దాదాపు 6 లక్షల పెన్షన్లను తొలగించారని,కొత్త రేషన్ కార్డులఊసే లేదని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు కేంద్రంతో పొత్తులో ఉంటూ, పరిపాలన చేతకాక ప్రతిదానికీ గత ప్రభుత్వంపై నెపం నెడుతున్నారని గోపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో విడతల వారీగా లీటరుకు మరో 3 నుండి 5 రూపాయలు పెంచాలని ప్రభుత్వం చూస్తోందని, ఇది అత్యంత అమానుషమని అన్నారు. సామాన్య ప్రజల సంక్షేమం కోసం పెంచిన ఇంధన ధరలను తక్షణమే తగ్గించకపోతే వైస్సార్సీపీ తరపున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో సాధారణ ప్రజలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# ఆర్టీసీ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలి

**జిల్లా ఇంచార్జ్ కలెక్టర్‌కు పల్నాడు జిల్లా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ వినతి**



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో విద్యుత్ బస్సుల పేరుతో జరుగుతున్న దశలవారీ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈ రోజు నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ నాగమల్లేశ్వరరావు, ఆర్టీసీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ షేక్. ఖాజా, డిస్ట్రిక్ట్ సెక్రటరి జి.తిరుపతిరావు లు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ప్రభుత్వ రవాణా వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కొన్ని డిపోలలో విద్యుత్ బస్సులను అద్దె ప్రాతిపదికన ప్రైవేట్ సంస్థల ద్వారా నడుపుతున్న విధానాన్ని వెంటనే నిలిపివేయాలని ఏపీఎస్ఆర్టీసీ ని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రైవేటీకరణ చర్యల వల్ల సంస్థ భవిష్యత్తుతో పాటు వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, ప్రజలకు అందుతున్న చౌక మరియు నాణ్యమైన రవాణా సేవలు భారంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోవాలని సంస్థలో ఖాళీగా ఉన్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్ మరియు ఇతర సాంకేతిక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు కోరారు. అలాగే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సంస్థకు అవసరమైన నిధులను ప్రభుత్వమే సమకూర్చాలని, కార్మికుల ఉద్యోగ భద్రత, వేతనాలు మరియు సేవా హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రయోజనాలను, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రైవేటీకరణ చర్యలను నిలిపివేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలని జిల్లా కలెక్టర్ గారిని కోరారు. కోశాధికారి యం.పాపయ్య, యూనియన్ నాయకులు ఏ.ఎస్ రెడ్డి, పీ.కే.రావు, అంకారావు, కమల, ఎస్.ఎన్.రావు, యం. వెంకటేశ్వర్లు, షేక్. వలి, సి హెచ్. బ్రహ్మారావు మరియు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులను తక్షణమే తొలగించాలి

## - వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం - సిపిఐ

## - పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం విధానాన్ని తెచ్చామని, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది నేటికీ సక్రమంగా అమలు కావడం లేదని పల్నాడు జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తీవ్రంగా విమర్శించారు. సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్ ని సిపిఐ నాయకులు కలిసి గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల నిర్మూలనపై ఒక వినతి పత్రాన్ని అందజేశారు.సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పల్నాడు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వారం రోజుల వ్యవధిలో బెల్టు షాపులను పూర్తిగా తొలగించకపోతే, సిపిఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని కాసా రాంబాబు ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నరసరావుపేట మహిళా సమాఖ్య కార్యదర్శి యస్. దేవి, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్,అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పల్లె,పట్టణం అనే తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.యథేచ్ఛగా వెలుస్తున్న బెల్ట్ షాపుల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల జీవితాలు రోడ్డున పడుతున్నాయని వారు మండిపడ్డారు.బొల్లాపల్లి, వెల్దుర్తి, ఈపూరు లాంటి మండలాల్లోనే కాకుండా జిల్లాలోని అనేక గిరిజన తండాలు, గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి వీటిని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. బొల్లాపల్లి మండలం కండ్రిక గ్రామంలో అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న ఆటోను స్థానిక మహిళలు,గ్రామస్తులు ప్రాణాలకు తెగించి అడ్డుకోవడం అభినందనీయ మని నాయకులు కొనియాడారు. ఆటోలోని మద్యం సీసాలను రోడ్డుపై పడవేసి ధ్వంసం చేయడం ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన సెగను చూపించారని తెలిపారు.కండ్రిక మహిళల పోరాట స్ఫూర్తిని అభినందిస్తూ ఇదే తెగువ అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో రావాలని వారు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు రంగయ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పల్నాడు జిల్లా అధ్యక్షులు మేకపోతుల నాగేశ్వరరావు, దుగ్గి బ్రహ్మయ్య, సూరి, కోయ శ్రీను తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేమూరు లో యదేచ్ఛగా విద్యుత్తు వైర్ల చోరీలు

## - కేసులు పెట్టిన ప్రయోజనం లేని పరిస్థితి - ప్రభుత్వ సొమ్ము దొంగల పాలు



**వేమూరు :మే 18(మనసులో మాట)..** వేమూరు మండలంలో గత మూడు సంవత్సరాల నుండి మండల పరిధి గ్రామాల్లో విద్యుత్తు వైర్ల చోరీ యదేచ్ఛగా సాగుతోంది పెద్ద మొత్తంలో ట్రాన్స్కో కు నష్టం జరుగుతున్న సరైన చర్యలు చేపట్టడం లేదు ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్లు రిజిస్టర్ చేస్తున్నారే కానీ దొంగలను గుర్తించే విషయంలో అంతగా ఫలితం లేకుండా ఉంది 2023లో వేమూరు జగనన్న కాలనీలో ఏర్పాటుచేసిన విద్యుత్తు లైన్లు పూర్తిగా కట్ చేసి చోరీ చేశారు స్తంభాలకు ఏర్పాటుచేసిన ఎల్ఈడీ బల్బులు కూడా తీసుకువెళ్లారు తద్వారా కోటి రూపాయలు నష్టం వాటిల్లింది అప్పటి ట్రాన్స్కో ఏఈ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. అయినా ప్రయోజనం లేకపోయింది తరువాత పలుచోట్ల వ్యవసాయ మోటార్ల దొంగతనాలు జరుగుతున్నాయి.ఈనెల 1వ తేదీన చావలిలో రైతుల పంపు షెడ్లకు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు కిలోమీటర్ దూరం కొత్త పోల్స్ వేసి మూడు లైన్ల కండక్టర్ ను ఏర్పాటు చేశారు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసే లోగా వైర్లను దొంగలించకుండా ఉండేందుకు మూడు లైన్ల వైర్లకు కలిపి సప్లై కూడా ఇచ్చారు అయితే 24 గంటల వ్యవధిలోనే దొంగలు సప్లై ని కట్ చేసి మూడు లైన్ల వైర్ ను చోరీ చేశారు 17 స్తంభాల మధ్య కనీసం గజం ముక్క కూడా వదల్లేదు దీనివల్ల రెండున్నర లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది దీనిపై పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కూడా ఫైల్ చేశారు. ఇలా గ్రామాల్లో ఏదో మూల విద్యుత్తు శాఖ చోరీలు విస్తృతంగా జరుగుతూనే ఉన్నాయి దొంగలను గుర్తించే విషయంలో ఏ ఒక్కరు సరైన శ్రద్ధ చూపటం లేదు దీంతో చోరీ దారులకు ఏమాత్రం భయం లేకుండా పోయింది కొత్త లైన్లు ఏర్పాటు చేసే సందర్భంలో సంబంధించిన కూలీలను ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారిని కాంట్రాక్టర్లు తీసుకురావడం జరుగుతుంది ఈ చోరీలకు సంబంధించిన కూలీల పాత్ర ఉండి ఉంటుందని పలువురు భావిస్తున్నారు ప్రభుత్వానికే కాకుండా కాంట్రాక్టర్లకు కూడా నష్టం వాటిల్లుతోంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు పోలీస్ శాఖ విద్యుత్ చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది

# ప్రజాపక్షాన పోరాటం.. ధరల పెంపుపై సమరభేరి!

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి: శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

## తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



**మాచర్ల.18 మే (మనసులో మాట)** రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను విచ్చలవిడిగా పెంచుతూ సామాన్య ప్రజలపై ప్రభుత్వం మోయలేని భారం మోపుతున్న తీరును నిరసిస్తూ, సోమవారం మాచర్ల పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎన్నికల సమయంలో పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు ప్రజలపై మరింత భారం మోపడం బాధాకరం. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మరింత భారంగా మారింది. ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా వెంటనే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ మాచర్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పల్నాడు జిల్లా వై.యస్.ఆర్.సి.పి అధ్యక్షులు ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ధరల బాదుడుకు నిరసనగా ర్యాలీ

**సత్తెనపల్లి మే 18 (మనసులో మాట)..** ప్రజల పై పెట్రోల్, డీజిల్ ధరల బాదుడే బాదుడుకు నిరసనగా వైఎస్సార్సీపీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఆర్డీవో ఆఫీస్ వరకు జరిగింది. అనంతరం పెంచిన పెట్రోల్, డీజిల్ తో పాటు నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని ఆర్డీవో ఆఫీస్ ఇంచార్జ్ ఏవో చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ ప్రజలపై నిత్యవసర వస్తువులైన పెట్రోల్ డీజిల్ గ్యాస్ వంట నూనెల ధరలు ప్రజలకు గుదిబండలా మారాయన్నారు. ఎన్నికలకు ముందు పెట్రోల్ డీజిల్ నిత్యవసర వస్తువులు ధరలు పెంచమని, తగ్గిస్తామని చెప్పి వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించారన్నారు. ధరల పెంచి వారి జీవనంపై అధిక భారం వేస్తున్నారని రైతన్నలు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అవటమే కాకుండా వ్యవసాయానికి వాడే వాహనాలకు డీజిల్ ఎక్కువగా అవసరం అవుతుందని ధరలు పెంచడంతో రైతులకు పెనుబారంగా మారిందన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై కల్పిత కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలందరూ దీన్ని గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలకు త్వరలో తగిన బుద్ధి చెప్తారని పెంచిన పెట్రోల్ డీజిల్ నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పోరాడుతామని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజలకు మంచి చేయాలని వారికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల అంబేద్కర్ పార్క్ వద్ద పోలీసులు తనిఖీలు



**మాచర్ల.18 మే (మనసులో మాట)..** ప్రజల భద్రత దృష్ట్యా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని పట్టణ ఎస్ఐలు వెంకట్రావు. స్వర్ణలత అన్నారు. మాచర్ల లోని అంబేద్కర్ పార్క్ వద్ద తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్. సరైన పత్రాలు లేకుండా ప్రయాణం చేసేవారికి జరిమానాలు విధించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. బైక్స్ నడిపేవారు లైసెన్స్ తో పాటు సంబంధితన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

# ఏపీలో మద్యం ఏరులై పారుతోంది

## కూటమి నేతల కనుసన్నల్లోనే బెల్ట్ షాపుల దందా!

**- అక్రమ మద్యం వ్యాపారాలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్ర ఆగ్రహం**

**- పేదల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదు - రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిపిఐ పిలుపు!**

**చిలకలూరిపేట మే 18 మనసులో మాట ..** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరికొత్త మద్యం విధానాన్ని తీసుకువచ్చామని, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అత్యంత భయానకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్నం అనే తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోంది. సరిహద్దుల గుండా వస్తున్న అక్రమ మద్యం, గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా వెలుస్తున్న బెల్ట్ షాపులు పేద మధ్యతరగతి కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. లీగల్ షాపుల కంటే అక్రమ కౌంటర్లే ఎక్కువైపోవడంతో సామాన్యుల బతుకులు రోడ్డున పడుతున్నాయి.

**అక్రమార్కులపై కన్నెర్ర చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి....**

రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ మద్యం వ్యాపారాలు, పల్లెపల్లెనా వెలుస్తున్న బెల్ట్ షాపులపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అండదండలతోనే ఈ అక్రమ దందా సాగుతోందని ఆయన మండిపడ్డారు. గుడి, బడి, దేవాలయం, కనీసం ఆసుపత్రులు అనే తేడా కూడా లేకుండా ఎక్కడపడితే అక్కడ బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి పేదల రక్తాన్ని తాగుతున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ఈ బెల్ట్ షాపులను రద్దు చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

గ్రామాలను పంచుకున్న కూటమి నేతలు....

రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ అధికార కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ)కి చెందిన గ్రామ, మండల స్థాయి ద్వితీయ శ్రేణి నాయకులు మద్యం వ్యాపారాన్ని ఒక ముఠాగా మార్చేశారని ఈశ్వరయ్య



ఆరోపించారు. ఏ గ్రామంలో ఎవరు బెల్ట్ షాపులు నడపాలనే దానిపై ముందే ఒప్పందాలు చేసుకుని, గ్రామాలను పంచుకుని మరీ అక్రమ విక్రయాలు సాగిస్తున్నారు. ఎమ్మార్పీ (వీ-రా) కంటే అదనపు ధరలకు విక్రయిస్తూ రోజుకు లక్షలాది రూపాయల అక్రమ సంపాదనకు తెరలేపారు. ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు ఉండటంతో స్థానిక యంత్రాంగం కూడా వీరి వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయడం లేదు.

**యువతే లక్ష్యంగా అక్రమ దందా....**

ప్రస్తుతం తీవ్రమైన వేసవి కాలం కావడంతో, యువతను ఆకర్షించడానికి గ్రామాల్లోని బెల్ట్ షాపుల నిర్వాహకులు బీర్లను ఆశ చూపిస్తూ వారిని మద్యానికి బానిసలుగా మారుస్తున్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులు, ఉపాధి వెతుక్కోవాల్సిన యువత ఈ వ్యసనానికి చిక్కి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పండించిన చేతికొచ్చిన డబ్బును, రెక్కాడితే గాని డొక్కాడని కూలీలు సంపాదించిన సొమ్మును మద్యం రూపంలో తగలేస్తుండటంతో ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

**మామూళ్ల మత్తులో ఎక్సైజ్, పోలీస్ శాఖలు....**

ప్రభుత్వాలు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తుండటంతో పోలీసు వ్యవస్థ, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖలు పూర్తిగా నిద్రావస్థలోకి జారుకున్నాయి. నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమ మద్యం రవాణా వాహనాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం బెల్ట్ షాపులను నిర్మూలించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి మూగప్రేక్షకులుగా ఉండిపోవడంతో ఈ దురాగతాలు యథేచ్ఛగా నడుస్తున్నాయి.

**తిరగబడుతున్న మహిళా లోకం...**

మద్యం మహమ్మారి వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా నాశనమవుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే వినుకొండ నియోజకవర్గ పరిధిలోని బొల్లాపల్లి మండలం కండ్రిక గ్రామంలో అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న ఆటోను స్థానిక మహిళలు, గ్రామస్తులు ప్రాణాలకు తెగించి అడ్డుకున్నారు. నిరసన తెలపడమే కాకుండా, ఆటోలోని మద్యం సీసాలను రోడ్డుపై పడవేసి ధ్వంసం చేయడం ద్వారా తమ నిరసన సెగను ప్రభుత్వానికి చూపించారు. కండ్రిక మహిళల పోరాటం రాష్ట్రవ్యాప్త మద్యం వ్యతిరేక ఉద్యమానికి దిక్సూచి అని గుజ్జుల ఈశ్వరయ్య కొనియాడారు.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పేదల జీవితాలను బలితీసుకుంటున్న అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా అరికట్టాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రజా తిరుగుబాటును ఎదుర్కోవలసి వస్తుందని సిపిఐ హెచ్చరించింది.



### నరసరావుపేటలో ఘనంగా

## 'స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర'

**- పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ**

**- పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత**

**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** స్వచ్ఛమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నరసరావుపేట నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు, 1వ వార్డు పరిధిలోని పాత జెండా చెట్టు లైన్ ప్రాంతంలో భారీ పారిశుధ్య మరియు శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన స్థానిక పారిశుధ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించడమే కాకుండా, ప్రత్యక్షంగా శ్రమదానంలో పాల్గొని ప్రజలతో కలిసి పనిచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకున్నప్పుడే 'స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యం పరిపూర్ణమవుతుందని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. పట్టణంలోని కాలువలు, వీధులు, మురుగు నీటి వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న స్థానిక సమస్యలను తక్షణమే గుర్తించి అధికారులు పరిష్కరించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు, స్థానిక వార్డు సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ పోలేరమ్మ తల్లి ద్వాదశ జాతర మహోత్సవాలు

### యువ నేత మండలనేని చరణ్ తేజకు ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం



**చిలకలూరిపేటమే 18 మనసులో మాట..** పట్టణంలోని 25వ వార్డు, బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లి ద్వాదశ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని, మే 24, 2026న నిర్వహించబోయే ద్వాదశ వార్షికోత్సవ మహోత్సవానికి జనసేన పార్టీ నియోజకవర్గ యువ నాయకులు, ప్రముఖ ప్రదాత మండలనేని చరణ్ తేజకు ఆహ్వానం అందింది. ఆలయ కమిటీ సభ్యులు చరణ్ తేజ కార్యాలయానికి విచ్చేసి, చరణ్ తేజ ను మరియు జనసేన పార్టీ సమన్వయకర్త తోటరాజ రమేష్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పెట్రోలు డీజిల్ ధరలు తగ్గించాలి

### పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని ఎడ్ల బండి పై ద్విచక్ర వాహనాన్ని నిలిపి పట్టణంలో ర్యాలీ చేసిన వైసీపీ నేతలు

**రేపల్లె మే 18 మనసులోమాట..** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచమని ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రేట్లు పెంచడాన్ని నిరసిస్తూ రాష్ట్రమాజీముఖ్యమంత్రివర్యులు వైఎస్ఆర్సిపి అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రోజు రేపల్లె నియోజకవర్గం లో నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ నియోజకవర్గంలోని వివిధ గౌరవప్రదమైన పదవుల్లో ఉన్ననాయకులు,కార్యకర్తలు, రైతులు ప్రజలు తో కలసి బస్టాండ్ సెంటర్లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆర్డిఓ కి వినతిపత్రం అందజేసారు అనంతరం పీటా మోహన్ మాట్లాడుతూ ప్రజలను వహించడంలో కూటమి ప్రభుత్వం ది ట్ట అన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం అనేక వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయకుండా ప్రజలను వంచించారన్నారు. కూటమి ప్రభుత్వానికి తెలిసింది డబ్బు



సంపాదన ప్రజలను వంచించడం ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం వంటి కార్యక్రమాలు తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామనే ఆలోచన ఒక్క శాతం కూడా లేదన్నారు రాజధాని పేరుతో ఇప్పటికే ఆ ప్రాంత రైతులు వద్ద నుండి వేలాది ఎకరాలను దోచుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు ప్రజలను వంచించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మించిన వ్యక్తి దేశంలోనే లేరన్నారు అబద్ధాలు ఆడటంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అమరావతిలో ఆకాశ సౌధాలు నిర్మిస్తున్నట్లు ప్రజలకు భ్రమ కల్పించి సంపాదనే లక్ష్యంగా తండ్రి కొడుకులు పనిచేస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు గడచిన రెండు సంవత్సరాలపరిపాలనలోనే మూడు లక్షల కోట్లు అప్పులు చేసి వారి ఖజానాల్లో దాచుకున్నారు ఇటువంటి సందేహం లేదన్నారు ఇప్పటికే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని చీకో డుతున్నారని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా టిడిపి ప్రభుత్వం పై వ్యతిరేకత వచ్చిందని రానున్న ఎన్నికల్లో వైసీపీ దే విజయమని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమని అప్పుడే ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లు చిమ్మట బాలాజీ చిత్రాల ఓబేదు బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కె కృష్ణారెడ్డి పట్టణ వైసిపి అధ్యక్షుడు కరేటి శేషగిరిరావు మండల కన్వీనర్ ఎం అనిల్ కుమార్ నాయకులు లియాకత్ భాష అబ్దుల్ కుద్దూస్ పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు అనంతరం ఆర్డిఓ శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు



## ఖత్నా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట రూరల్ మే 18 మనసులో మాట..** చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన మర్రి రాజశేఖర్ వీరాభిమాని షేక్ బషీర్ కుమారుడు చిరంజీవి మీరా మొయినుద్దీన్ ఖత్నా (ఒడుగులు) కార్యక్రమం వారి స్వగృహంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సోమేపల్లి వాసు, జాలాది సుబ్బారావు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో సయ్యద్ హిదాయితుల్లా, నాగూర్, శరత్ చంద్, మద్దిరాల సుభాని, ఈశ్వరరెడ్డి, నాగూర్ జానీ, షేక్ రఫీ, కళ్యాణ్ ఎం కే , మస్తాన్ పోతవరం, ప్రత్తిపాటి విజయ్, లింగాల విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాపట్లలో పెట్రోల్ ధరల పెరుగుదలపై వైసీపీ నిరసన



**బాపట్ల మే18 (మనసులోమాట)..** ఏపీలో పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసీపీ పార్టీ నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఎన్నికల హామీకి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం ధరలు పెంచి, సామాన్యులపై భారం మోపిందని ఆ పార్టీ మండిపడింది. ఈ పెంపు వల్ల రైతాంగం, రవాణా రంగం, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, నిత్యావసరాల ధరలు పెరిగాయని ఆరోపించింది. అన్ని నియోజకవర్గాల్లో నిరసనలు తెలిపి, అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని పార్టీ శ్రేణుల అదేశాలనుసారం. బాపట్ల నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలకు నిరసన కార్యక్రమం అనంతరం బాపట్ల మండలం ఎమ్మార్వో కి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

## జన్మదిన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి



**ఎడ్లపాడు మండలం మే 18 మనసులో మాట..** యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామ ముఖ్య నాయకులు ఆలోకం శ్రీనివాసరావు (ఆలోకం శ్రీనాథ్ కుమార్తె) మనవరాలి రెండవ జన్మదిన వేడుకలు వారి స్వగృహంలో ఘనంగా జరుగుచుండగా, ఆ వేడుకకు హాజరై చిన్నారి వ్రింద ని ఆశీర్వదించి, కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ..

# ఆర్డీవో కార్యాలయ లో గ్రీవెన్స్ కు 14 అర్జీలు నమోదు



**రేపల్లె మే 18 మనసులోమాట..** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం గ్రీవెన్స్లు ఏర్పాటు చేసిందని ఆర్డిఓ బి శ్రీదేవి అన్నారు

ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీదేవి రేపల్లె నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగినది సదరు కార్యక్రమమునకు వచ్చిన ఫిర్యాదు వివరములు తెలియజేస్తూ1. రేపల్లె మున్సిపాలిటీ నుండి రేపల్లె పట్టణ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టిట్కో ఇళ్లను త్వరితగతన పూర్తి చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 2. రేపల్లె మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు నుండి ఎర్రంశెట్టి వెంకటేశ్వరమ్మ మొదలైన వారు వడ్డీకి కొంత సొమ్ము తీసుకొని సదరు నగదును చెల్లించినప్పటికీను వారిని వేధించుచున్నారని కావున సదరు వారి మీద శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ ఒక అర్జీ 3. నిజాంపట్నం మండలం నిజాంపట్నం గ్రామ నివాసి అయిన కోరగంటి విద్యాసాగర్ అనువారు చినమట్లపూడి గ్రామం నందు గల సర్వేనెంబర్ 554 మరియు 549 మధ్య ఉన్న కాలువ మీద ఆక్రమణలను తొలగించవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 4. నగరం మండలం నగరం గ్రామ నివాసేన ఇంకొల్లు వెంకట విజయలక్ష్మి అనువారు రిసర్వేనందు తన భూమి తగ్గినదని తన భూమిని సర్వే చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 5. నగరం మండలం నగరం గ్రామ నివాసి అయిన ఇంకొల్లు బాల వెంకట కోటేశ్వరరావు అనువారు రీసరి నందు తన భూమి తగ్గినదని తన భూమిని సర్వే చేసి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 6. నగరం మండలం నగరం గ్రామ నివాసి అయిన ఇంకొల్లు రంగారావు అన్నవారు రిసర్వే నంద తన భూమి తగ్గినదని తన భూమిని సర్వే చేసి రెవెన్యూ రికార్డుల నందు నమోదు చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ7. రేపల్లె మండలం కామరాజు గడ్డ నార్త్ గ్రామానికి చెందిన ఆలూరు సుబ్బారావు అనువారు కామరాజు గడ్డ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ను విచారణ చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 8. రేపల్లె మండలం కామరాజు గడ్డ నార్త్ గ్రామానికి చెందిన ఆలూరి నాంచారయ్యను వారు కామరాజు గడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ వారిపై విచారణ చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 9. రేపల్లె మున్సిపాలిటీ నుండి ఎలవర్తి శివపార్వతి అనువారు వృద్ధాప్య పెన్షన్ కొరకు వారికి గల రైస్ కార్డు నందు వారిని వారి అత్తగారిని విభజన చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 10. రేపల్లె మండలం చోడయపాలెం గ్రామ నివాసి అయిన గడ్డం జయలక్ష్మి అనువారు బిఏఓగా పనిచేయుట జరిగినదని, సదరు పనిచేసిన ఆరు నెలల కాలమునకు జీతమును మంజూరు చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 11. రేపల్లె మండలం చెన్నుపల్లి వారి పాలెం గ్రామనివాసేన ఊస నాగమల్లేశ్వరి అను వారు పనిచేయుట జరిగినదని తను పనిచేసిన 9 నెలల కాలమునకు జీతమును మరియు శ్రీనిధి డబ్బును మంజూరు చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 12. చెరుకుపల్లి మండలం రాంబట్ల పాలెం గ్రామ నివాసి అయిన పగడం ధనలక్ష్మి అనువారు రి సర్వే నందు తన భూమిని నమోదు చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 13. రేపల్లె మున్సిపాలిటీ నుండి ఓలేటి వీరరాఘవయ్య అనువారు రేపల్లె మున్సిపాలిటీ నందు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధమును అమలు పరచవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 14. రేపల్లె మున్సిపాలిటీ నుండి షేక్ రజాన్ జానీ అనువారు నీటి సమస్యను తీర్చవలసినదిగా కోరుతూ ఒక అర్జీ

మొత్తం 14 అర్జీలు వచ్చినవనితెలియపరచి నారు వచ్చిన అర్జీలను పరిశీలన చేసి ఆయా శాఖలకు పంపి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు

# బాబోయ్ వేళా పాళా లేని, అనధికార కరెంటు కోతలు

### - ఇదే అదునుగా స్వైర విహారం చేస్తున్న ట్రాన్స్ఫార్మర్ దొంగలు



**కారంపూడి, మే 18, ( పల్నాడు జిల్లా )** మనసులో మాట :- కారంపూడి మండలంలో వేళ్ళ పాళ లేని అనధికార విద్యుత్ కోతతో మండల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒకపక్క విద్యుత్ కోతలు లేవని, అలా ఎవరైనా అనధికార విద్యుత్ కోతలు విధిస్తే తగిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరిస్తున్నారు. అయినా ఇవేమి తమకు పట్టవని చెబుతున్నట్లుగా కారంపూడి మండలంలో మాత్రం విద్యుత్ శాఖ వారు విచ్చలవిడిగా కరెంటు కోతలను అమలుపరుస్తున్నారు. కరెంటు తీసిన ప్రతిసారి సెల్ ఫోన్ లో సిబ్బంది క్రియేట్ చేసుకున్న గ్రూపులలో కరెంటు రావడానికి టైం పడుతుందని ఒక మెసేజ్ పడేసి వారి ఇష్టం వచ్చినట్లు కరెంటు కోతలు పెడుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శిస్తున్నారు. దీనికి కారణం మండలంలో దాదాపుగా 18 సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల వరకు పాతుకుపోయిన సిబ్బంది విద్యుత్ శాఖ మండల అధికారులను సైతం లెక్కచేయక వారిని బెదిరించే స్థాయిలో విధులను నిర్వర్తిస్తున్నారని మండల ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. విద్యుత్ ఉన్నత అధికారులు సైతం వీరిని ఏమి చేయలేకపోతున్నారని ఘాటైన విమర్శలు మండలంలో ఉన్నాయి. ఇక్కడే పాతుకుపోయిన కొంతమంది, కమ్యూనిటీ పరమైన సమస్యలను లేవనెత్తి, ఇక్కడి అధికారులను బెదిరిస్తూ తమ హవా కొనసాగిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. కారంపూడి మండలంలోని తిష్ట వేసుకొని కూర్చుని ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నందున, విద్యుత్ శాఖ అనుమతి లేని ఆస్తులు ఎలా వచ్చాయో తెలియజేయాలని ఉన్నతాధికారులు తాఖీదులు జారీ చేయడంతో ఏం చేయాలో దిక్కుతోచని సిబ్బంది, వాటిపై పైరవీలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులతో పగలు రాత్రులు అనేది లేకుండా పనులు చేపించటం మండలంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలో, గ్రామాలలో, కారంపూడి పట్టణంలో కూడా ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతుందని మండల విద్యుత్ వినియోగదారులు ఘాటుగా విమర్శిస్తున్నారు. అయినా స్థానిక అధికారులకు కానీ, ఉన్నతాధికారులకు కానీ ఈ విమర్శలపై స్పందన కరువైందని, మండలంలో పాతుకుపోయిన సిబ్బందితో పని చేయించలేకపోతున్నారని పదునైన విమర్శలు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా పొలాలలో పైరులు ఏమీ లేకపోవడంతో, రైతులు కూడా పొలాల వైపుకు వెళ్లకపోవడంతోను, దానికి తోడుగా ప్రతి రాత్రి 10 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ కోతలతో విద్యుత్ సరిగా లేకపోవడంతో ట్రాన్స్ఫార్మర్ల దొంగలకు తమ పనులు సులువుగా చేసుకొనుటకు అవకాశం కల్పించినట్లుగా ఉంటుందని మండల



రైతులు విమర్శిస్తున్నారు.క్రొత్త ట్రాన్స్ఫార్మర్ పెట్టాలన్న , కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో మరొక ట్రాన్స్ఫార్మర్ పెట్టాలన్న ఇక్కడ కమిషన్ల పద్ధతిలో పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించుకొని వేలాది రూపాయలు ముట్ట చెప్తేనే ట్రాన్స్ఫార్మర్లు వస్తాయని రైతులు ఘాటుగా విమర్శలు చేస్తున్న, విద్యుత్ అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్ఫార్మర్ల దొంగలు మండలంలో ట్రాన్స్ఫార్మర్లు దొంగిలిస్తూ స్వైర విహారం చేస్తుంటే బాధ్యతారాహిత్యంగా రాత్రి వేళల్లో కూడా విద్యుత్ నిలిపివేయటం ఏమిటని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పాతుకుపోయి, విధులు అంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారితో పనులు చేయిస్తూ, రైతులకు విద్యుత్ కష్టాలను తొలగించాలని కారంపూడి మండల రైతులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.



### పెట్రోలు డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ

# వైయస్సార్సీపి ధర్నా

**తెనాలి మే18(మనసులో మాట)..** పెట్రోల్ డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గం ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలోనే పెట్రోల్ డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయని,దీనివల్ల ప్రత్యామ్నాయ రంగాలైన రవాణా రంగంపై భారం పడుతుందని నిత్యావసర వస్తువులు ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురి అవుతారన్నారు. ప్రజలను పొదుపు చేయండి అని చెబుతూ మంత్రులు కాన్వాయి తగ్గించుకోవడం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదని, ప్రభుత్వ సొమ్ముతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వం సామాన్యులపై భారం పడకుండా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని శివకుమార్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు పరిశీలించిన ధూళిపాళ్ళ



**పెదకాకాని, మే 18. మనసులో మాట:** మండలం పరిధిలోని లోని ఉప్పలపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులను సోమవారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించిన పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్ కార్డ్ హోల్డర్స్ గా నమోదు కాబడి ఉన్న వారికి 100 రోజుల పాటు ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ జాబ్ కార్డ్ హోల్డర్స్ కు హాజరు నమోదు చేయడం లో జాప్యం ఉండకూడదని అధికారులకు తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డ్ హోల్డర్స్ కు త్రాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు ఈ పనులను పర్యవేక్షించాలని అన్నారు. ఔశీతీని ×ణ- 36922,36999మరియు 76482,76232 పుచ్చకాయల డొంకలోని పంట కాలువ పూడిక తీత పనుల్లో ఉపాధి హామీ జాబ్ కార్డ్ హోల్డర్స్ తో కలిసి పాల్గొని శ్రమదానం చేశారు. తదుపరి ఉప్పలపాడు గ్రామంలోని ఫిడర్ ఛానల్ లకు 'జలధార' 18 లక్షల నిధులతో ఫిడర్ ఛానల్ అభివృద్ధి చేసి గ్రామ ప్రజలకు ,రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలం అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు బూసి బాబు మైనార్టీ నాయకులు షేక్ అల్లావుద్దీన్, మండల అధికారులు, కూటమి, నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు అడ్డగోలుగా ప్రజల కష్టాన్ని దోచేసి.. నేడు వీధిపోరాటాలా? : ప్రత్తిపాటి

### ఆస్తిపన్ను..నీటిపన్ను..చెత్తపన్ను.. వ్యాట్ పేరుతో పెట్రోల్, డీజిల్ పై భారం..

### 9సార్లు విద్యుత్ ఛార్జీల మోతతో ప్రజలకు చుక్కలు చూపించింది వైసీపీ ప్రభుత్వం కాదా?

**చిలకలూరిపేట మే 18 మనసులో మాట ..** "మతిలేని రాజకీయాలతో వైసీపీ ప్రజల్లో మరింత పలచనవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడు సిద్ధాంతాన్ని క్రమం తప్పకుండా ఆచరించి, ప్రజలకు రోజూ పట్టపగలే చుక్కలు చూపించిన ఘనకీర్తి వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. ఆస్తిపన్ను, చెత్తపన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఆర్టీసీ, నీటి వినియోగ ఛార్జీల పెంపు సహా, 9 సార్లు విద్యుత్ ఛార్జీల పెంచి ప్రజల కష్టాన్ని పాయసంలా దిగమింగినవారు..నేడు ఇంధన ధరలపై వీధిపోరాటాలు చేయడం విడ్డూరంగా ఉంది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావమే ఇంధన సంక్షోభానికి కారణమని వైసీపీకి తెలియదా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయంతో సంబంధం లేకుండా, భారత్ తో పాటు, అనేక దేశాలు యుద్ధ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నది నిజం కాదా? 2019-24లో పన్నులు, ధరల పెంపుతో ప్రజల్ని పీడించిన వైసీపీ ప్రభుత్వం.. రాజకీయ నిరసనలు చేయడం హాస్యాస్పదం.



**పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ భారం మోపినప్పుడు జగన్ కు ప్రజలు గుర్తురాలేదా?**

దేశంలో ఏపీలోనే పెట్రోల్ , డీజిల్ ధరలు అధికమని 2020లో పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటించినప్పుడు జగన్ కు ప్రజలు, వారి కష్టాలు గుర్తురాలేదా? పెట్రోల్.. డీజిల్ పై అధిక వ్యాట్, రోడ్ల అభివృద్ధి సెస్సుతో ప్రజల జేబులకు చిల్లు పెట్టిన ఘనత జగన్ సర్కార్ దే. వైసీపీ ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఏటా రూ.900 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు ప్రజల ముక్కుపిండి వసూలు చేసింది. నాడు అడ్డగోలుగా ప్రజల కష్టం దోచేసిన వైసీపీ నేతలు... నేడు నిస్సిగ్గుగా రాజకీయలబ్ధికోసం వెంపర్లాడుతున్నారు. జగన్ అనాలోచిత అహంకారపూరిత నిర్ణయాలతో ఐదేళ్లు ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఇసుక, మద్యం కుంభకోణం, ప్రకృతి వనరుల దోపిడీ, కృత్రిమ భూ సమస్యల సృష్టితో సామాన్య, మధ్య తరగతి వర్గాల జీవితాల్ని జగన్ పూర్తిగా రోడ్డున పడేశాడు.

కూటమిప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల మేలే కోరుతుంది అనడానికి విద్యుత్ ఛార్జీల ట్రూ డౌనే నిదర్శనం. యూనిట్ కు 13 పైసల తగ్గింపు ప్రయోజనాల్ని నేరుగా ప్రజలకు అందించి, తమది ప్రజా ప్రభుత్వమని నిరూపించింది. జగన్ విద్యుత్ సంస్థలపై మోపిన రూ.4,500 కోట్ల ట్రూ అప్ భారాన్ని చంద్రబాబు ప్రభుత్వం భరిస్తోంది. జగన్ చేసిన లక్షల కోట్ల అప్పులు భారం ప్రజలపై పడకుండా, సంక్షేమ.. అభివృద్ధి ఫలాలు ప్రజలకు పంచుతోంది." అని ప్రత్తిపాటి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

### ప్రత్తిపాటిపుల్లారావుపుట్టినరోజుసందర్భంగా

# 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

### రెటీనా సహా క్లిష్ట కంటి వ్యాధులకు ఉచిత చికిత్సలు : డాక్టర్ విజయ్ కృష్ణ



**చిలకలూరిపేటమే 18 మనసులో మాట ..** గత 40 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజా రమేష్ కుమారుడు, విజయ్ కృష్ణ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ, మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు ను పురస్కరించుకొని ఆయన కుమారుడు ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో ప్రముఖ శంకర్ కంటి వైద్యశాల సహకారంతో ఈ నెల 29వ తేదీ శుక్రవారం చిలకలూరిపేటలో 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కంటి శుక్లాల సమస్యలకు మాత్రమే పరిమితమైన సేవలను ఈసారి మరింత విస్తృత స్థాయిలో అందిస్తున్నామని వెల్లడించారు. రెటీనా సంబంధిత వ్యాధులు, రెటీనా డిటాచ్మెంట్తో పాటు కంటికి సంబంధించిన పలు క్లిష్ట సమస్యలకు సైతం నిపుణులైన వైద్యులచే ఉచితంగా చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. సాధారణంగా లక్ష రూపాయలకు పైగా ఖర్చయ్యే అత్యాధునిక వైద్య చికిత్సలను పూర్తిగా ఉచితంగా అందించడం ఈ శిబిరం ప్రత్యేకత అని తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ప్రజాసేవలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అందిస్తున్న సేవలు అభినందనీయమని డాక్టర్ విజయ్ కృష్ణ కొనియాడుతూ ప్రత్తిపాటికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కృష్ణ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు



సింగరాయకొండ మే 18, (మనసులో మాట) కొండేపి నియోజకవర్గం సింగరాయకొండ మండలంలోని ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వం"... పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలపై భారం మోపుతున్న కూటమి ప్రభుత్వం. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రివర్యులు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ౹ాూజ సభ్యులు, కొండేపి నియోజకవర్గం ఇంచార్జ్ గౌ॥ శ్రీ డాక్టర్. ఆదిమూలపు సురేష్ ఆదేశాల మేరకు కొండపి నియోజకవర్గం 6 మండలాల మండల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో వినూత్న నిరసన ర్యాలీ... ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న వైసీపీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు..

ఎడ్లబండిపై ఎక్కి నిరసన వ్యక్తం చేసిన కొండేపి నియోజకవర్గం 6 మండల అధ్యక్షులు..

ఎడ్లబండి లాగుతూ "ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి" అంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన వైఎస్ఆర్సిపి నేతలు కార్యకర్తలు.

పెట్రోల్, డీజిల్ ధరల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ను అగ్రస్థానంలో నిలిపిన కూటమి ప్రభుత్వం వెంటనే ధరల మంటను తగ్గించాలని డిమాండ్ చేశారు. సింగరాయకొండ చేపల మార్కెట్ దగ్గర నుంచి ఎమ్మార్వోకార్యాలయం వరుకు ఏడ్ల బండి లాగుతూ ఎమ్మార్వో కి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం వివిధ విభాగం అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు, నాయకులు మరియు అభిమానులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీకి నిధులు పెంచాలి

## బకాయి వేతనాలు విడుదల చేయాలి

**తెనాలి మే 18 (మనసులో మాట)..** ఉపాధి హామీకి నిధులు పెంచాలని, బకాయి వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన అన్ని స్వర్ణ సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రం అందజేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి తెలిపారు. సోమవారం తెనాలి రూరల్ గ్రామం కోపల్లె ఉపాధి కార్మికులతో మాట్లాడారు.గతంలో జిల్లాకు లక్ష కుటుంబాలకు పని కల్పిస్తే ఈ ఏడాది కేవలం 9,461 కుటుంబాలకు మాత్రమే పని దొరుకుతుందని ఆయన తెలిపారు. ఉపాధి పనులకు గతంలో పలుగు,పార మంచినీళ్లు కు డబ్బులు ఇచ్చేవారని, ఈ సంవత్సరం నుండి అవన్నీ తీసివేశారు. ఫేస్ యాప్ పెట్టడం వలన నెట్ అందుబాటులో లేక ఫేస్ మ్యాచ్ కాక పని వరకు వచ్చి తిరిగి వెళ్ళవలసిన పరిస్థితి వస్తుందని ఆయన తెలిపారు. ఉపాధి హామీకి మన రాష్ట్రానికి పదివేల కోట్లు కేటాయించాలని, రెండు పూటలా పని పద్ధతి రద్దు చేయాలని అడిగిన వారందరికీ పని కల్పించాలని పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## సిలబస్ తగ్గింపుతో పాటు, ఉపాధ్యాయుల నియామకం అవసరం



**భట్టిప్రోలు మే 18 మనసులో మాట..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి కొన్ని సబ్జెక్టుల్లో పాఠ్యాంశాల తగ్గింపు చేపట్టిన ప్రభుత్వం,అత్యంత విస్తృతమైన మరియు భారమైన సిలబస్ కలిగిన సాంఘీక శాస్త్రంపై మాత్రం ఎలాంటి తగ్గింపులు చేయకపోవడం పట్ల ఏపీ ఎస్ ఎస్ టి ఎఫ్ ఫోరం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ ఆందోళన వ్యక్తం చేశారు.సోమవారం భట్టిప్రోలు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 9వ,10వ తరగతుల సాంఘీక శాస్త్ర సిలబస్ విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు.అనేక చాప్టర్లు,పెద్ద సమాధానాలు, తేదీలు,రాజ్యాంగ అంశాలు,మ్యాప్ వర్క్,విశ్లేషణాత్మక ప్రశ్నలు వంటి విస్తృత అంశాలతో కూడిన ఈ సబ్జెక్టు విద్యార్థులకు భారంగా మారిందన్నారు. ముఖ్యంగా పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సోషల్ స్టడీస్ పట్ల భయం, ఒత్తిడిని అనుభవిస్తున్నారని తెలిపారు. ఇంగ్లీష్ వంటి ఇతర సబ్జెక్టుల్లో పాఠాల తొలగింపులు చేసినట్లే,సోషల్ స్టడీస్‌లో కూడా అవసరమైన పాఠ్యాంశాల పునర్విమర్శ చేపట్టి విద్యార్థులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను ప్రజాస్వామ్య పద్ధతిలో కోరుతున్నట్లు మురళీమోహన్ తెలిపారు.

అలాగే ఇతర రాష్ట్రాల్లో సాంఘీక శాస్త్రాన్ని విభజించి చరిత్ర,భూగోళ శాస్త్రం, రాజ్యాంగం,ఆర్థిక శాస్త్రం వంటి విభాగాలను ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని ప్రస్తావించారు.అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సాంఘీక శాస్త్ర బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల బోధన నాణ్యత మెరుగుపడటంతో పాటు విద్యార్థులకు అంశాలపై స్పష్టమైన అవగాహన పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

సాంఘీక శాస్త్రం అనేది సమాజాన్ని అర్థం చేసుకునే ముఖ్యమైన సబ్జెక్టు అయినప్పటికీ, ప్రస్తుత సిలబస్ విస్తృతి విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. సిలబస్ భారాన్ని తగ్గించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెరిగి అభ్యాసం మరింత ఫలవంతమవుతుందని తెలిపారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఉపాధ్యాయుల బోధనా సౌలభ్యం, విద్యా ప్రమాణాల సమతుల్యం దృష్ట్యా సాంఘీక శాస్త్ర సిలబస్‌పై ప్రభుత్వం తక్షణ పునర్విమర్శ చేపట్టి అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని ఏపీ ఎస్ ఎస్ టి ఎఫ్ ఫోరం తరపున గుర్రం మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 45 అర్జీలు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

### సమస్యలు విన్నవించుకున్న 45 మంది అర్జీదారులు - చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తాం

**బాపట్ల మే18 (మనసులోమాట)..** చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అర్జీదారులకు భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 45 మంది అర్జీదారులు కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ



వారితో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో వేగవంతంగా విచారించి, నిర్ణిత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చెయ్యాలని ఆదేశించారు. అర్జీ దారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం

**తెనాలి మే 18 (మనసులో మాట)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ విభాగం (ఆయుర్వేద వైద్య విభాగం) పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం పురపాలక సంఘ నూతన భవనంలో నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సంగం జాగర్లమూడి ఆయుష్ హాస్పిటల్ వైద్యాధికారిణి డాక్టర్ జి.హిమబిందు, తూములూరు ఆయుష్ హాస్పిటల్ వైద్యాధికారిణి డాక్టర్ ఆర్.అర్చన, సిబ్బంది, పాల్గొని సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కు వచ్చిన వారికి, పారిశుద్ధ్య కార్మికులకు, పురపాలక సంఘ సిబ్బందికి, షుగర్ బీపీ తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు పురపాలక సంఘ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మొవ్వ యేసు బాబు,అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు, మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్, తదితరులు



పరిశీలించి ఆయుర్వేద వైద్య శిబిరం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జాగర్లమూడి ఆయుష్ హాస్పిటల్ వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం అనేది మన భారతదేశంలో పురాతన కాలం నుండి కొనసాగు తున్న వైద్యం అన్నారు. ఆయుర్వేదంలో కూడా అన్ని జబ్బులను పూర్తిగా నయం చేయగలిగిన మందులు ఉన్నాయని చెప్పారు. ప్రతినెల రెండవ సోమవారం తెనాలి పురపాలక సంఘం కార్యాలయంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందనీ, ఈఅవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్.ఆర్. అర్చన మాట్లాడుతూ ప్రభుత్వం ఆయుర్వేద వైద్యాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగా అనేక ప్రాంతాలలో ఆయుష్ వైద్యశాలలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆయుర్వేదంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని మందులు ఉన్నాయని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి అశ్వగంధ చూర్ణం, అర్జున రిష్ట, బాలా రిష్ట త్రిఫల చూర్ణం, కర్పూరది తైలం వంటి వివిధ రకాల మందులను ఇవ్వడం జరిగిందని తెలిపారు . ప్రభుత్వం ఆయుష్ హాస్పిటల్స్ ద్వారా అందిస్తున్న సేవలను అందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ఎఫ్.ఎన్.ఓ. రమాదేవి, ఎంఎన్ఓలు టి .ఏ. కుమార్, మురళీకృష్ణ, ఏఎన్ఎంలు సౌజన్య, సునీత , కేవిస్ అరుణకృష్ణ, యోగా ట్రైనర్ ,ఏ కృష్ణ ప్రసాద్, ఎం. అప్పారావు, ఆశా వర్కర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ నిర్వహణలో కేంద్రం విఫలం.. విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

### - పేపర్ లీకేజీతో విద్యార్థుల జీవితాలను అంధకారం చేశారు,డిబిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ ధ్వజం

### - నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.. ఇంటర్ మార్కుల ఆధారంగానే మెడికల్ సీట్లు ఇవ్వాలని డిమాండ్

**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ డిమాండ్ చేశారు.సోమవారం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్‌లో గల డి.బి.హెచ్.పి.ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థినీ విద్యార్థులు మెడికల్ సీటు సాధించాలనే ఏకైక లక్ష్యంతో, రాత్రింబగళ్లు ఎంతో ఏకాగ్రతతో చదివి నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతుంటే, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వారి ఆశలు ఆవిరవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నీట్ పరీక్ష పత్రం తయారు చేసే కమిటీలో కీలకంగా వ్యవహరించిన కులకర్ణి, మనీషాలు దేశవ్యాప్తంగా ఉన్న




విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని రమేష్ కుమార్ మండిపడ్డారు. వారు నీట్ పేపర్‌ను లీక్ చేసి, తమ సొంత ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలోని విద్యార్థులకు భారీ మొత్తాలకు అమ్ముకోవడం అత్యంత దారుణమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించాల్సిన జాతీయ స్థాయి పరీక్ష పేపర్ గత రెండు సంవత్సరాలుగా లీకవుతుంటే గుర్తించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ అనాలోచిత వైఖరికి, అలసత్వానికి అద్దం పడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. లక్షలాది రూపాయలు ఫీజులు కట్టి, ఎన్నో ఆశలతో నీట్ కోచింగ్ తీసుకున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలను ఈ పేపర్ లీక్ ఉదంతంతో అంధకారంలోకి నెట్టేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి నీట్ పేపర్ లీక్ విషయంలో దోషులను పూర్తి స్థాయిలో విచారించి, వారిపై కఠిన శిక్షలు అమలయ్యేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.గత రెండు సంవత్సరాలుగా నీట్ పరీక్ష రాసి లీకేజీల వల్ల తీవ్రంగా నష్టపోయిన విద్యార్థులందరికీ, వారి ఇంటర్మీడియట్ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగానే మెడికల్ కాలేజీల్లో సీట్లను కేటాయించి న్యాయం చేయాలని రమేష్ కుమార్ కోరారు. భవిష్యత్తులో దేశంలో ఎక్కడా ఇలాంటి లీకేజీ ఉదంతాలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు, భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దళిత బహుజన హక్కుల పోరాట సమితి స్థానిక నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక వేసవి శిక్షణ తరగతులు

**తెనాలి మే18(మనసులో మాట)..** స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉచిత ఆధ్యాత్మిక వేసవి శిక్షణా తరగతులు ఆధ్యాత్మిక వాతావరణంలో కనుల పండుగగా కొనసాగుతున్నాయి.

వేసవి సెలవుల్ని దృష్టిలో పెట్టుకుని దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక విషయాల పట్ల అవగాహన కల్పిస్తూ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈ.వో హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇస్కాన్ తెనాలి శాఖ ప్రతినిధి ప్రభుదాసు విద్యార్థులకు ఆధ్యాత్మికత,సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న వి.హెచ్ పి రామాంజనేయులు సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించేలా దేవదాయ శాఖ కార్యక్రమాలను నిర్వహించడం హర్షనీయ మన్నారు. విద్యార్థిని, విద్యార్థులలో ఆధ్యాత్మిక భావన కలిగించేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆలయ ఈ.వో హరిప్రసాద్ చేస్తున్న చర్యలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో శిక్షణ తరగతుల శిక్షకులు త్రిపురారిపట్ల ప్రమీల విద్యార్థులు విద్యార్థులకు పలు ఆధ్యాత్మిక అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర వరప్రసాద్, నాట్య గురువు చల్లా బాలా త్రిపుర సుందరి, పలువురు స్థానికులు, పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్ ని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతిఒక్కరు సైనికుడు లా పనిచేయాలి



**రేపల్లె మే 18 మనసులోమాట..** ప్రజల మనిషి సీనియర్ నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రేపల్లె నియోజకవర్గం లోని వైఎస్ఆర్సిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు . ఆదివారం రాత్రి నియోజకవర్గంలోని కనకాల పంచాయతీ లో ఉన్న ముస్లిం సోదరులు శ్రీనివాసరావును కలిసి దృశ్యాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గొడవలకు వెళ్ళవద్దని ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు అనవసరంగా గొడవలకు వెళ్లి గొడవలు పడి పోలీస్ కేసులు పెట్టించుకోవద్దన్నారు మీకు అండగా ఉంటానని పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసే వైఎస్ఆర్సిపి జెండాను రేపల్లె నియోజకవర్గంలో రిజర్వేషన్లకు కృషి చేయాలన్నారు తద్వారా రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానం అధిరోహిస్తారని అప్పుడే పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని సంక్షేమ పథకాలు అమలు లు జ రుకుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు మాజీ కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు ముస్లిం యువత పాల్గొన్నారు

## వార్డుల రీ-డివిజన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

గురజాల, మే 18 (మనసులో మాట ): గురజాల నగర పంచాయతీలో ఇప్పుడున్న 20 వార్డులను 23 వార్డులుగా చేస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని నగర కమీషనర్ శివన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను 2011 జనాభా ప్రకారం తయారు అయ్యింది అని, ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించామ అని తెలిపారు. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే 24.05.2026 తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు లిఖిత పూర్వకంగా కమీషనర్, గురజాల నగర పంచాయతీ వారికి అందజేయాలి అని ఆయన తెలియచేశారు.

# బీడు భూములు ఇక జలకళ

### మరమ్మతులకు నోచుకోని కాల్వలకు జలధార
### - చివరి వ్యవసాయ భూములకు సాగునీరు - సంతోషంగా రైతులు
### జలధార జలహారతిపై ప్రత్యేక కథనం

**బాపట్ల మే18( మనసులోమాట)..** బీడు భూములు ఇకనుంచి సాగులోకి రానున్నాయి. పంట కాల్వల ద్వారా ఇప్పటివరకు చుక్క నీరు అందని పొలాలకు సమృద్ధిగా జలాధార తో నీరు చేరనుంది. నిరుపయోగంగా దర్శనమిస్తున్న ఫీడర్ కాల్వలు జలాధారతో జల కళను సంతరించుకోనుంది. పూడి పోయిన పంట కాల్వలు వినియోగంలోకి తీసుకురావడం జలధార లక్ష్యం. ఒట్టి పోయిన,పూడి పోయిన కాల్వలు, భూములలో జలధారలు ప్రవహించనున్నాయి. ఎంతోకాలంగా ఆశతో ఎదురు చూస్తున్న రైతుల ముఖలలో ఆనందం వెల్లి విరుస్తుంది. కాల్వల ద్వారా చివరి భూములకు నీరు అందించాలని విఫలయత్నం చేసిన రైతుల ఆశలు కార్యరూపం దాల్చాయి. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా చర్యలు తీసుకుంటుంది. రైతులకు మేలు జరిగేలా రూపొందించిన ప్రణాళికలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు రానున్నాయి. రైతుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది.జలధార -జలహారతి




పిట్టల వారి పాలెం మండలం కోడూరు గ్రామం పరిధిలో సామాజిక ఫీడర్ కాల్వ మరమ్మతు పనులకు అన్నదాతలు శ్రీకారం చుట్టారు. ఎంతో కాలంగా సాగునీరు అందక రైతులు తమ పొలాలను బీడు పెట్టారు. మా భూములకు నీరు ఇవ్వండి అంటూ రైతులు చేసిన విన్నపాలు గత కొన్నేళ్లుగా బుట్టదాఖలయ్యాయి. జలధార జలహారతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడంతో సామాజిక ఫీడర్ కాల్వ మరమ్మతు చేయడానికి అవకాశం లభించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ఒక కిలోమీటర్ మేర కాల్వ మరమ్మతు పనులకు అన్నదాతలు శ్రీకారం చుట్టారు. తట్టా బుట్టా చేతబూని, గుణపాలు చెలకపారలతో పనులు ప్రారంభించారు.

**రైతులకు వరం జలధార**

జలధార జలహారతి కార్యక్రమం రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుంది. ఒక కిలోమీటర్ మేర ఫీడర్ ఛానల్ పూడికతీత పనులు మొదలయ్యాయి. కాల్వ శుభ్రం చేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ప్రభుత్వం తోడ్పాటును అందించింది. సాగు నీరు విడుదల కాగానే సప్లై ఛానల్ లోకి పుష్కలంగా జలాలు చేరనున్నాయి. కొన్నేళ్లుగా మూతపడిన కాల్వ వినియోగంలోకి రానుంది. కాల్వ మరమ్మతు పనులతో 1500 ఘనపు మీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఏర్పడింది. తద్వారా 100 నుండి 150 ఎకరాలు సాగులోకి రానున్నాయి. కాల్వ సమీపంలోని పొలాలకు భూగర్భ జలాలు పెరగనున్నాయి. దీంతో 20 మందికి పైగా రైతులు లబ్ధి పొందనన్నారు. ఎంతో కాలంగా ఎదురు చూసిన రైతుల ఆశలు సఫలీకృతం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

**కందుకూరు మే 18 (మనసులో మాట)** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కందుకూరును ఈరోజు ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు ఆకస్మిక తనిఖీ చేశారు.. ఇందులో భాగంగా ఈ పాఠశాలలోని 10వ తరగతి ఫలితాలు, విద్యార్థులకు క్లాసులు జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఒకసారి ఫెయిల్ అయినంత మాత్రాన అధైర్య పడకూడదని, ఎటువంటి పరిస్థితుల్లోనూ భయపడకుండా మరల రాసి విజయం సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థులను కోరారు.



అనంతరం కందుకూరు మండలంనకు సంబంధించిన ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు పాఠ్యపుస్తకములు నిల్వ ఉంచిన స్టాక్ రూమ్ ను పరిశీలించి కందుకూరు మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన అన్ని సబ్జెక్టులకు సంబంధించిన టెక్స్ట్ బుక్స్ ను, వర్క్ బుక్స్ ను ను తరగతి వారీగా, పాఠశాలలవారీగా క్రమ పద్ధతిలో ప్యాకింగ్ చేసి వివిధ పాఠశాలల కు పంపిణీకి సిద్ధం గా ఉంచిన మండల విద్యాశాఖ అధికారులైన కే సుబ్బారెడ్డి మరియు ఎం ఎన్ కే శర్మ లను మరియు ఆఫీసు సిబ్బందిని, సిఆర్ఎంటిలను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి ,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు..

## వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలకు రెగ్యులర్ వైస్ ఛాన్సర్లును నియమించాలి

**దాచేపల్లి మే 18 ( మనసులో మాట)** రాష్ట్రంలోని వ్యవసాయ పశు వైద్య ఉద్యాన మరియు మత్స్య విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వైస్ ఛాన్సిలర్లను నియమించాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వినతి పత్రం జూనియర్ అసిస్టెంట్ డానియల్ గారికి మేమరాండం అందజేశారు ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలోని వ్యవసాయ విద్య పరిశోధన విస్తరణ సేవలు పశు వైద్య అభివృద్ధి ఉద్యానవన పురోగతి మత్స్య సంపద వృద్ధి గ్రామీణ నవ కల్పనా మరియు ఆహార భద్రత బలోపేతం చేయడంలో వ్యవసాయ పశు వైద్య ఉద్యాన



మత్స్య విశ్వవిద్యాలయాలకు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు సమర్థవంతమైన విద్యా మరియు పరిపాల నాయకత్వంపై ఆధారపడి ఉండి వేలాది మంది విద్యార్థులు పరిశోధకులు శాస్త్రవేత్తలు, రైతులు భాగస్వాములకు ఇవి సేవలందిస్తున్నాయన్నారు ప్రస్తుతం వైస్ ఛాన్సర్ కార్యాలయాల్లో ఇంచార్జ్ తాత్కాలిక ఏర్పాట్లు లేదా ఖాళీలు దీర్ఘకాలం కొనసాగడం వలన విద్యా పరిపాలన విధాన నిర్ణయాలు నియామకాలు పదోన్నతులు ప్రక్రియలు పరిశోధన సమన్వయ సమన్వయం నిధులు సమీకరణ కార్యక్రమాలు సహకారాలు సంస్థ గత అభివృద్ధి విద్యార్థుల సంక్షేమం రైతు ఆధారిత కార్యక్రమాల సకల అమలు తదితరులు అంశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి అన్నారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం గురజాల నియోజకవర్గం కార్యదర్శి కందిమళ్ళ సైదారావు, తెల్లనాకుల సత్యనారాయణ సయ్యద్ సైదా శ్రీపతి కోటేశ్వరరావు పత్తిపాటి వెంకట నాగరాజు మురికిపూడి సర్వేయ్యభూక్య నరసింహ నాయక్ పాల్గొన్నారు.



## సీనియర్ ఫోటోగ్రాఫర్ దూళిపాళ్ళలక్ష్మీకాంతారావు పార్ధివా దేహానికి నివాళులర్పించిన మర్రి రాజశేఖర్

**నాదెండ్ల మే 18 : మనసులోమాట..** నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో నివసిస్తున్న సీనియర్ ఫోటోగ్రాఫర్ ధూళిపాళ్ళ లక్ష్మీ కాంతారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని శాంతినగర్ లోని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేసిన శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్, ఈ కార్యక్రమంలో వారివెంట లివలేటి హిమవంతరావు , కాట్రు శ్రీనివాసరావు , నాగభూషణం తదితరులున్నారు.

## ప్రతి ఒక్కరికి తాగునీరు అందించేందుకు చర్యలు

### 45.10 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**రేపల్లె మే 18 మనసులోమాట..** నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటి సమస్య తల ఎత్తకుండా ఉండేందు కు ప్రభుత్వ చర్యలు చేపట్టిందని రాష్ట్రం మంత్రి అనగాని సోదరులు శివప్రసాద్ అన్నారు సోమవారం నియోజకవర్గంలోని నగరం మండలం సజ్జావారిపాలెం గ్రామంలో జల్ జీవన్ మిషన్ గ్రాంట్ ద్వారా 45.10 లక్షల నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ మాత్యులు అనగాని సత్య ప్రసాద్ సోదరులు శివప్రసాద్ శంకు స్థాపనచేసారు కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు ..

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

**పెదకాకాని, మే 18. మనసులో మాట:** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి కే రమణకుమార్ అన్నారు. ఈ అప్లికేషన్లు పెట్టుటకు ఈనెల 19వ తేదీ గడువు ముగుస్తుందని కావున కావలసిన రైతులు ఆన్లైన్లో అప్లికేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా యంత్ర పరికరములు రాయితీపై ఇచ్చుటకు పెదకాకాని మండలానికి 16 లక్షల 88 వేల విలువ కలిగిన బడ్జెట్ను కేటాయించడం జరిగిందన్నారు. ట్రాక్టర్ ద్వారా ఉపయోగించు పరికరాలకు 1.68 లక్షలు సస్యరక్షణ పరికరములు అనగా స్ప్రేయర్స్ తైవాన్లు వాటికి 3.3లక్షల ఇవ్వటం జరిగినది. అదేవిధంగా ట్రాక్టర్స్ 40 హార్స్ పవర్ 5 లక్షల పదివేలు ఇవ్వటం జరిగిందని అన్నారు. ఈ యంత్ర పరికరాలు కావలసిన రైతులు ఆన్లైన్లో గాని లేదా గ్రామ రైతు సేవ కేంద్రంలో సందర్శించి వ్యవసాయ సహాయకులు సహాయంతో వెబ్ పోర్టల్ నందు అప్లై చేసుకోవాలని తెలిపారు . ఎస్సీ ఎస్టీ రైతు సోదరులకు 50 శాతం రాయితీ జనరల్ రైతులకు 40 శాతం రాయితీ ఉంటుందన్నారు. కాబట్టి మంగళవారం 19వ తేదీన ఆన్లైన్లో అప్లై చేసుకునే గడువు ముగుస్తుందని కావున కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు . తదుపరి జిల్లా అధికారులు లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయటం జరుగుతుందన్నారు.

# ప్రజల ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

### - జిల్లా కలెక్టర్ రాజాబాబు



**ఒంగోలు మే 18( మనసులో మాట )..** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులకు నిర్దేశిత గడువులోపల నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యు అధికారి శ్రీధర్ రెడ్డి, ఎస్డిసిలు కళావతి, విజయజ్యోతి, డిపిఓ వెంకటేశ్వర రావు లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. సమస్యపై తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు మళ్లీ రీ-ఓపెన్ కాకూడదని, ఒకవేళ ఏదైనా అర్జీ రీ-ఓపెన్ అయితే సంబంధిత అధికారి తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారంనిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో మొత్తం 257 వినతులు రావడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా గోగుల మనోహర్ యాదవ్

### - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించిన మనోహర్ యాదవ్



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన గోగుల మనోహర్ యాదవ్ ఈరోజు గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించినందుకు గాను డాక్టర్ గోపిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన మనోహర్ యాదవ్ మంచి వ్యక్తిత్వమున్న నాయకుడని కొనియాడారు. రాజకీయాల్లో సరైన నాయకత్వ పటిమతో, పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. యువకుడు, ఉత్సాహవంతుడైన మనోహర్ యాదవ్ తనకు అప్పగించిన పదవికి పూర్తి వన్నె తేవాలని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంటెనపాటి గాబ్రియల్, జిల్లా ఇంటలెక్చువల్ సెల్ సెక్రటరీ గుదే కిరణ్ కుమార్ (అడ్వకేట్), మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోగుల శంకరమ్మ, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, పెద్దలు, మహిళలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 20న నరసరావుపేట నియోజకవర్గంలో మెడికల్ షాపుల బంద్

### - ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు అసోసియేషన్ వినతి



**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ దేశవ్యాప్త పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన నరసరావుపేట నియోజకవర్గంలో మెడికల్ షాపులు బంద్ చేయనున్నట్లు నరసరావుపేట తాలూకా కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు బంద్ పిలుపు వినతి పత్రాన్ని గుంటూరు రోడ్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే చదలవాడ కు అసోసియేషన్ సభ్యులు సోమవారం అందజేశారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా స్థానికంగా జరగబోయే ఈ బంద్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 12.40 లక్షల కెమిస్టులు, డ్రగ్గిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు ఈ బంద్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రధానంగా అక్రమ ఈ-ఫార్మసీల (ఆన్‌లైన్ మెడిసిన్ విక్రయాలు), కార్పొరేట్ సంస్థల డీప్ డిస్కౌంటింగ్ (20-60% తగ్గింపులు) వ్యతిరేకంగా ఈ ఉద్యమం జరుగుతోందని వివరించారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ప్రిస్క్రిప్షన్ వెరిఫికేషన్ లేకుండా మందులు అందజేయడం వల్ల రోగుల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం, అలవాటు మందుల దుర్వినియోగం, ~~× ద్వారా నకిలీ ప్రిస్క్రిప్షన్లు వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ కాలం నాటి సడలింపులు ఇప్పటికీ కొనసాగడం వల్ల చిన్న, సాంప్రదాయిక మెడికల్ షాపుల వ్యాపారం దెబ్బతిని, గ్రామీణ, అర్ధనగర ప్రాంతాల్లో స్థానిక కెమిస్టుల ఉపాధి ప్రమాదంలో పడుతోందని, దీనివల్ల సుమారు 5 కోట్ల మంది ఆధారపడిన ఫార్మాస్యూటికల్ వ్యాపార రంగం దెబ్బతినే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర మందులను కొన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా తమకు అవసరమైన మందులను ముందుగానే సేకరించుకోవాలని అసోసియేషన్ సూచించింది. ఈ వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి, తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డి. శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వి.ఎస్. మోహన్ రావు, ట్రెజరర్ ప్రవీణ్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



# వ్యవసాయ పనులు అన్నదాతలు

## - రైతన్నకు వ్యవసాయమే జీవన విధానం

**నాదెండ్ల మే 18 : మనసులోమాట..** భారతదేశము విస్తీర్ణంలో 50 శాతం పైగా వ్యవసాయానికి అనుకూలంగా ఉండటంవల్ల భారతదేశాన్ని వ్యవసాయక దేశం అంటారు. భారతదేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్. ఒక ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర జనాభాలో 60 శాతం మంది ప్రత్యక్షంగాను పరోక్షంగాను వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయంలో వచ్చిన హరిత విప్లవం రైతుల కృత్రిమ ఎరువులు పురుగుమందులపై ఆధారపడేలా చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం 50 శాతానికి పైగా వ్యాధులు మనం తినే ఆహారం వలన వస్తున్నాయి. గతంలో పోల్చుకుంటే ఆహారంలో 80 నుండి 30 శాతం పోషకాలు తగ్గిపోయాయి మనుషుల్లో క్యాన్సర్ వంటి జబ్బులు రావడానికి పురుగుమందుల అవశేషాలే కారణమని పలు పరిశోధనలు రుజువు చేశాయి. మరోవైపు నెలలో జీవవైవిధ్యం తో పాటు మొక్కల వైవిధ్యం కూ డా తగ్గిపోయింది దీనివల్ల నేలలో ఆరోగ్య ప్రమాదం లోబడింది. నేల కోత వలన దేశంలో సగటున ప్రతి సంవత్సరం ఒక హెక్టార్ భూమి నుండి 16.5 టన్నుల మట్టిని కోల్పోతున్నాము అధిక ఉష్ణోగ్రతలు వల్ల భూతాపం పెరిగిపోయింది. దీనివల్ల వ్యవ సాయ దిగుబడులు భారీగా తగ్గి ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ పరిస్థితులు ఇలాగనే కొనసాగితే ఈ నేల మీద మొక్కలు కూడా మొలిసిన పరిస్థితులు ఉండవనేది శాస్త్రీయ గుణలో అంచనా ఇటీవల డెవలప్మెంట్ ఆఫ్ ఇంటిలిజెన్స్ యూనిట్ డిఐయు విడుదల చేసిన స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 భయంకరమైన నిజాలన మన ముందు పెట్టింది ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల్లో 60 శాతం మంది పంట అతి తక్కువ దిగుబడుల కారణంగా సాగును వదిలివేయాలని నిర్ణయించుకున్నారు. కుటు ంబం సంతోషంగా జీవించడానికి వ్యవసాయం ఉపయోగకరం కాదని 63 మంది శాతం పురుషులు, 62 శాతం మహిళలు అభిప్రాయపడ్డారు. అందుకే గ్రామీణ యువత ఉద్యోగాలు వెతుక్కుంటూ వలసలు పోవడానికి ఇష్టపడుతున్నారు పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పి ల్లలను వ్యవసాయంలో కొనసాగించుకోవటం అనుకోవడం లేదు. ఇది మనందరి ఉమ్మడి సమస్య వ్యవసాయం లావుదాయకం కాదని వదిలేసి ప్రత్యక్షంగా పరోక్షంగా కోట్లాదిమంది జీవనోపాధి కోల్పోతారు. దీంతో కరువు ఇలైతాండం చేస్తుంది. దిగుబడుల కోసం కృత్రిమ ఎరువులు ఉపయోగించడం వల్ల రోగాలతో జనం మంచాల బారిన పడతారు వ్యవసాయ పర్యావరణం దెబ్బతింటే వాతావరణం పెరిగిపోయి భూమి కూడా నివాసయోగ్యం కాకుండా పోతుంది దీనికి పరిష్కారం మన చేతుల్లోనే ఉంది మనం మన పిల్లలకు చిన్నతనం నుండి ప్రకృతి వ్యవసాయం పట్ల పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలి. మన నేలపట్ల ప్రకృతి పట్ల శ్రమ పట్ల నిర్లక్ష్యం వహిస్తే మన భవిష్యత్తుతో పాటు పిల్లల బంగారు భవిష్యత్తును కూడా పాడుచేసిన వాళ్ళ అవుతాము. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కలిగి ఆ దశలో పంటలకు సాగు చేస్తే పంటల సమృద్ధిగా పండించి దేశానికి ప్రకృతి ఆహార ధాన్యాలను సమర్థవంతంగా అందించి దేశంలో ఆహార ధాన్యాల కొరతను నివారించవచ్చు ప్రతి రైతుప్రకృతి వ్యవ సాయ భావాలకు అలవాటు పడాలి.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన విచారించి, బాధితులకు సత్వర న్యాయం చేయాలి

## - ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు - ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంకు 88 ఫిర్యాదులు



**ఒంగోలు మే 18 (మనసులో మాట)..** ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సోమవారం ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం కార్యక్రమం నిర్వహించారు. మీకోసం కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుదిక్కుల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు స్వీకరించి వారితో మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంభందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, త్వరితగతిన విచారించి చర్యలు తీసుకోని, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలనలోకి తీసుకొని, సంఘటన స్థలాలను సందర్శించి చట్టప్రకారం సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి.శ్రీధర్, ఒంగోలు రూరల్ సిఐ శేషగిరి రావు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# చింతలపాలెంలో ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కరువు

## - వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్




**నరసరావుపేట మే 18 (మనసులో మాట):** నరసరావుపేట మండలం చింతలపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ తీవ్రంగా ధ్వజమెత్తారు. చింతలపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎండలు మండిపోతున్నా పని ప్రదేశాల్లో కూలీలకు తాగడానికి మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదని వెంకట్ మండిపడ్డారు. చట్టం ప్రకారం కల్పించాల్సిన నీడ కొరకు గుడారాలు, మెడికల్ కిట్లు (ఫస్ట్ ఎయిడ్), పనిముట్లు వంటివేవీ అధికారులు అందించడం లేదని, క్షేత్రస్థాయిలో అధికారులు నామమాత్రంగా కాలం గడుపుతున్నారని విమర్శించారు. మార్చి నుండి మే నెల వరకు చేసిన పనికి అదనంగా ఇవ్వాల్సిన 30 శాతం సమ్మర్ అలవెన్స్‌లను వెంటనే చెల్లించాలని, పని కోరిన 15 రోజుల్లోగా పని కల్పించని వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాల ప్రస్తావన లేకుండా ఎలాంటి పత్రాల అవసరం లేకుండా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించే గొప్ప సామాజిక న్యాయ చట్టం ఇది. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని, తమ పిల్లల చదువులకు, పౌష్టికాహారానికి ఖర్చు చేస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని నిపుణులే చెప్పారు. కుల అంతరాలు ఉన్న ప్రాంతాల్లో నిరుపేదలు భూస్వాములపై ఆధారపడకుండా ఈ చట్టం కాపాడింది. గత 20 ఏళ్లుగా ఎంతోమంది పేదల ప్రాణాలను నిలిపిన ఈ పథకాన్ని రద్దు చేయాలని చూడటం పేదల పొట్టకొట్టడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించే ఈ పథకంలో లేబర్ కాంపోనెంట్‌కు 60 శాతం, మెటీరియల్ కాంపోనెంట్‌కు 40 శాతం ఖర్చు చేయాల్సి ఉంటుందనిఉపాధి హామీ నిధులను ఇతర రంగాలకు మళ్లించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకంతో పాటు 108 రకాల పనులను ఉపాధి కూలీల ద్వారా చేసుకునే వెసులుబాటు ఉన్నా, ఇక్కడి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరును, వసతుల లేమిని పరిశీలించి కూలీలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మరియు స్థానిక కూలీలు జి. హర్ష, సురేష్, జగన్, లక్ష్మి, కోటమ్మ, నారాయణ, అబ్బాయి, సుబ్బారావు, చామంతి తదితరులు పాల్గొన్నారు.

# వేమూరు రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల దప్పిక తీరుస్తున్న చలివేంద్రం

## - దాతలకు అభినందనలు తెలుపుతున్న ప్రయాణికులు



**వేమూరు: మే 18( మనసులో మాట )** రైల్వే స్టేషన్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు దాతలు ఏర్పాటుచేసిన చలివేంద్రం రైల్వే ప్రయాణికులకు దప్పిక తీరుస్తుంది, వేమూరు రైల్వే స్టేషన్ లో గత ఏడు సంవత్సరాలుగా గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ తటవర్తి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు తటవర్తి వెంకట సాంబశివరావు సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు, గత ఏడు సంవత్సరాలుగా రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చూస్తున్న చలివేంద్రం ప్రయాణికుల దప్పిక తీరుస్తూ ఎంతగానో ఉపయోగపడుతుంది, వేసవిలో జొన్న మొక్కజొన్న పంటల పనుల నిమిత్తం వచ్చే వ్యవసాయ కూలీలకు, ప్రయాణికులకు ఎంతగానో ఉపకరిస్తుందని ప్రయాణికులు తన మనోగతాన్ని తెలియజేస్తున్నారు, ఎప్పటికప్పుడు చల్లటి నీటిని తాగుతూ రైల్వే ప్రయాణికులు తమ దాహార్తిని తీర్చుకుంటూ ఏర్పాటు చేసిన దాతలకు అభి నందనలు తెలియజేస్తున్నారు, చలివేంద్రం నిర్వహణలో తట్టపర్తి వెంకట సాంబశివరావు ఎప్పటికప్పుడు మంచినీటిని అందుబాటులో ఉండే విధంగా చూస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ చలివేంద్రాన్ని నడిపిస్తున్నారంటూ స్థానికులు సంశివరావును అభినందిస్తున్నారు, రైల్వే ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న సాంబశివరావు పలువురు అభినందిస్తున్నారు.